ప్రజాశక్తి
గురువారం 13 మార్చి 2025 8 పేజీలు

గుంటూరు పల్నాడు

సామ్రాజ్యంను పరామర్శిస్తున్న ధనలక్ష్మి ఇతర నాయకులు, ఆశాలు

ఆశా వర్కర్‌ను వేధించిన వారిపై చర్యలు తీసుకోవాలి

- సాంమ్రాజ్యంను పరామర్శించిన ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్రకార్యదర్శి ధనలక్ష్మి
- సత్తెనపల్లి, పిడుగురాళ్లలో నిరసనలు

ప్రజాశక్తి-గుంటూరు

పల్నాడు జిల్లా, అమరావతి మండలం, ఉంగుటూరుకు చెందిన ఆశావర్కర్ రాయపాటి సామ్రాజ్యంను రాజకీయ వేధింపులకు గురి చేసి, అత్మహత్యాయత్నానికి కారణమైన నిందితులపై చర్యలు తీసుకోవాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆశా వర్కర్‌ను ధనలక్ష్మి బుధవారం పరామర్శించారు.వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. అనంతరం ధరలక్ష్మి మాట్లాడుతూ ఉద్యోగుల విధి నిర్వహణలో ఏవైనా లోపాలుంటే సరైన పద్ధతిలో సరిదిద్దే ప్రయత్నం చేయాలిగానీ రాజకీయ కారణాలతో తొలగించాలని వేధింపులకు పాల్పడటం సరికాదన్నారు. విచారణ సమయంలో వందలాది మందితో పిహెచ్‌సి వద్దకు వచ్చి తొలగించాలని ఒత్తిడి చేశారని, దీంతో వందల మంది అధికార పార్టీకి చెందిన వారిని చూసి ఏమి చేయాలో తెలియక ఆశా వర్కర్ సాంమ్రాజ్యం ఆత్మహత్యాయత్నం చేసిందని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో రాజకీయ వేధింపులు పెరుగుతున్నాయని, ప్రభుత్వాలు మారినప్పుడుల్లా 2లో

తాడేపల్లి పట్టణంలోని పేదలతో మాట్లాడుతున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజి

25 ఏళ్లుగా రోడ్లపై మురుగు నీళ్లు

- తల్లికివందనం వస్తుందని ప్రైవేటు బడులకు పంపి మోసపోయాం
- ఒక బల్బు, ఒక ఫ్యానుకే రూ.998 కరెంటు బిల్లు
- సిపిఎం ప్రజాచైతన్య యాత్రల బృందం ఎదుట పేదల ఆవేదన

ప్రజాశక్తి- తాడేపల్లి

రాష్ట్ర మంతా సిమెంటు రోడ్లు వేశామంటున్నారని, మా ఇళ్ల ముందు మాత్రం 25 ఏళ్లగా మురుగుపారే మట్టిరోడ్లే గతయ్యాయని సిపిఎం నాయకులు ఎదుట ప్రజలు వాపోయారు. సిపిఎం చేపట్టిన ప్రజాచైతన్య యాత్రల్లో భాగంగా పట్టణంలోని రామయ్య కాలనీ, జజ్జీవన్‌రామ్ కాలనీ, లెనిన్ నగర్, ఇస్లాంపేటల్లో యాత్రలను సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజి బుధవారం ప్రారంభించారు. అనంతరం నాయకులతో కలిసి ఆ 2లో

సత్తెనపల్లిలో సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్

ఈతకెళ్లిన ఇద్దరు విద్యార్థులు మృతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మృతుడు తేజ్ కుమార్ (ఫైల్)

మృతుడు వెంకటగోపి (ఫైల్)

ఈతకని కాల్వలో దిగి ఇద్దరు విద్యార్థులు దుర్మరణం పాలైన ఘటన నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెం సమీపంలో బుధవారం సాయంత్రం జరిగింది. రూరల్ పోలీసుల వివరాలు ప్రకారం... ప్రకాశం జిల్లా రాపర్ల మండలం మాచవరం గ్రామానికి చెందిన తేజ్ కుమార్ (19), కురిచేడు మండలం వీరయ్యపాలెం గ్రామానికి చెందిన బొరిగొర్ల వెంకట గోపి (22), మరో ఇద్దరు యువకులతో కలిసి ఒకే ద్విచక్ర వాహనంపై పెట్లూరివారిపాలెం గ్రామ పరిధిలోని చిలకలూరిపేట మేజర్ కాల్వలో ఈతకు వెళ్లారు. ఈతకు దిగిన కాసేపటికి తేజ్ కుమార్, వెంకటగోపి కాలువలో ఇటీవల నిర్మించిన డ్రాప్ వద్ద గుంతలో చిక్కుకుని మృతి చెందారు. మృతుడు తేజ్ కుమార్ ఎఎం రెడ్డి కళాశాలలో డిప్లొమా మూడే ఏడాది చదువుతుండగా, వెంకట గోపి నరసరావుపేట ఇంజినీరింగ్ కాలేజీలో సిఎస్‌సి బ్రాంచ్ 3వ ఏడాది చదువుతున్నాడు. వీరు కోటప్పకొండ రోడ్డులోని మహేశ్వరి పిజి హాస్టల్‌లో ఉంటున్నారు. ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. వెంకట గోపి తండ్రి పదేళ్ల కిందట గుండెపోటుతో మృతి చెందగా తల్లి లచ్చుమ్మ పొలం పనులు చేసుకుంటూ కుమారుడిని చదివించుకుంటున్నారు.

రంజాన్ సమయాలు

ఇఫ్తార్ : 6.23 (గురువారం - సాయంత్రం)
సహర్ : 5.01 (శుక్రవారం - ఉదయం)

పదో తరగతి పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు ఉచిత ప్రయాణం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఈనెల 17 నుండి వచ్చేనెల 1వ తేదీ వరకు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు పల్నాడు జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.మధు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల ఇంటి వద్ద నుంచి పరీక్ష హాలు వరకు, పరీక్షలు రాసిన అనంతరం విద్యార్థులను ఇంటి వరకు చేర్చేందుకు పల్లె వెలుగు, అల్ట్రా డీలక్స్ బస్సుల్లో హాల్ టిక్కెట్ చూపించి ఉచితంగా ప్రయాణించవచ్చని పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు అదనపు సాయం : జిల్లా కలెక్టర్

గుంటూరు జిల్లాలో 14,112 గృహాలకు లబ్ధి- నిర్మాణంలో ఉన్న ఇళ్లకు అదనపు నిధులు

- 5 లో

బోరుగడ్డ అనిల్‌కు బెయిల్

ప్రజాశక్తి - గుంటూరు లీగల్

పాస్టర్ మరియదాసును బెదిరించిన కేసులో బోరుగడ్డ అనిల్ కుమార్‌కు గుంటూరు జిల్లా ఎక్సైజ్ కోర్టు బుధవారం బెయిల్ మంజూరు చేసింది. రాజమండ్రి సెంట్రల్ జైల నుండి పీటీ వారెంట్‌పై ఆయన్ను గుంటూరు జిల్లా జైలుకు పట్టాభిపురం పోలీసులు తీసుకురాగా మళ్లీ ఆయన్ను రాజమండ్రి జైలుకు తరలించారు.

సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న టిటిడి ఈవో జె.శ్యామలరావు, వేదికపై జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, ఎస్పి సతీష్ కుమార్ తదితరులు

కళ్యాణం ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలి : టిటిడి ఇఒ

ప్రజాశక్తి - తుళ్లూరు

శ్రీనివాస కళ్యాణం వేడుకల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని, టిటిడి, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని టిటిడి ఈవో జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు.ఈ నెల 15 వ తేదీన రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం వెంకటపాలెంలోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీనివాస కళ్యాణం జరగనుంది. కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొంటారు. ఈ నేపథ్యంలో శ్రీనివాస కళ్యాణం వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లపై ఈవో జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, ఎస్పి సతీష్ కుమార్, టిటిడి,జిల్లా అధికారులతో బుధవారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇఒ మాట్లాడుతూ శ్రీనివాస కళ్యాణంపై వెంకటపాలెం సమీపంలోని గ్రామాల్లో టిటిడి ప్రచారం రథం ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలన్నారు. భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా వేదిక పరిసరాలలో అవసరమైన గ్యాలరీలు,క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ అంతరాయం తలెత్తకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. కళ్యాణానికి భజన బందాలు, శ్రీవారి సేవకులను పెద్ద ఎత్తున ఆహ్వానించాలని చెప్పారు. జిల్లా,టిటిడి అధికారుల కోసం ప్రత్యేకంగా జాయింట్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. సీసీ కెమెరాలతో నిరంతరం భద్రతను పర్యవేక్షించేలా తగు చర్యలు తీసుకోవాలని ఎస్పి సతీష్ కుమార్‌ను కోరారు. తగినన్ని ఆర్టీసీ బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కల్యాణాన్ని ఎస్వీబీసీ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయాలని ఆదేశించారు. వేదిక పరిసరాలలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర సమయంలో తక్షణం స్పందించేలా విపత్తు నిర్వహణ బందాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు,మజ్జిగ పంపిణీకి శ్రీవారి సేవకులను సిద్ధం చేసుకోవాలని చెప్పారు. సాయంత్రం 4 గంటలనుండి సాంస్కృతిక కార్యక్రమాలుకు ఏర్పాట్లు చేయాల్సిందిగా హెచ్ డీపీపీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం ఆయన అధికారులతో కలసి కళ్యాణ వేదిక, తదితర పరిసరాల్లో ఏర్పాట్లను పర్యవేక్షించారు. జెసి భార్గవ్ తేజ,తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి, ఆర్డీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు, రేపు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల13వ తేదీ రాత్రి కళ్యాణం, 14వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు రథోత్సవ కార్యక్రమం జరుగుతుందని ఆలయ ఈవో, సహాయ కమిషనర్ ఎ.రామకోటిరెడ్డి తెలిపారు.

25 ఏళ్లుగా రోడ్లపై మురుగు నీళ్లు

తాడేపల్లిలో ఇళ్ల ఎదుట మురుగు నీటిని చూపుతున్న స్థానికులు

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతాల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నేతాజి మాట్లాడుతూ పేదలు నివాసం ఉండే ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం శ్రద్ధ పెట్టాలన్నారు. తాడేపల్లి పట్టణంలో 35 ఏళ్ల నుండి అటవీ ప్రాంతంలో నివాసాలు ఏర్పాటు చేసుకొని ఉంటున్న పేదలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని, అది ప్రభుత్వ బాధ్యతని అన్నారు. ఎన్నికలకు ముందు ఈ ప్రాంతంలో పర్యటించిన స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలన్నారు. అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బురగా వెంకటేశ్వర్లు, పట్టణ నాయకులు వేముల దుర్గారావు మాట్లాడుతూ గతంలో సిపిఎం ఆందోళనల ఫలితంగానే కొంతమేరకైనా అటువైపు ప్రాంతంలో తాగునీరు, వీధిలైట్లు, ఇళ్ల పునర్నిర్మాణం సాధ్యమైందని చెప్పారు. ప్రస్తుత సమస్యలపై పేదలంతా ఉద్యమాల్లో ఐక్యంగా కలిసి రావాలని పిలుపునిచ్చారు.

సంవత్సరాలు గడిచినా అతి గతి లేదు

రెండేళ్లలో పుష్కరాలు రాబోతున్నాయని, గత పుష్కరాలప్పుడు సీతానగరంలోని పేదల ఇళ్లను తొలగించి ఉండవల్లి గుంటూరు ఛానల్ సమీపంలో తాత్కాలిక స్థలాలు కేటాయించినా పట్టాలు మాత్రం ఇవ్వలేదని పుష్కర కాలనీ పేదలు సిపిఎం నాయకుల ఎదుట వాపోయారు. కరెంట్ బిల్లులు మోత మోగిపోతున్నాయని, రూ.200 కరెంటు వినియోగిస్తే మరో రూ.300 వివిధ రకాల ఛార్జీల పేరుతో వసూలు చేస్తున్నారని అన్నారు. తల్లికివందనం పథకం వస్తుందని నమ్మి పిల్లల్ని ప్రైవేటు బడుసల్లో చేర్పిస్తే ఇప్పుడు ఆ ఫీజులు చెల్లించలేక అవస్థ పడుతున్నామని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు డి. శ్రీనివాసకుమారి, వి.వెంకన్న, ఎస్‌కె జానీ, వి.రమణ, వేణు, మణి, మేరీ, ఎస్‌కె ఇర్ఫాన్, లక్ష్మీ, దుర్గా, రహంతో, వి.సామ్యేలు, కె.మేరీ, స్థానికులు కాళిదాసు, కోటేశ్వరి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి

పెరిగిన విద్యుత్ చార్జీలతో విద్యుత్ వినియోగదారులు బంబేలెత్తుతున్నారు. ఒకరున్న ఇంటికి ఒక బల్బు, ఒక ఫ్యాను ఉంటేనే రూ.998 బిల్లు రావడంతో వాటిని సిపిఎం నాయకులకు చూపి తమ ఆవేదనను వెళ్లబోసుకున్నారు. పట్టణంలోని కొత్తపేటలో సిపిఎం ప్రజాచైతన్య యాత్రను బుధవారం నిర్వహించగా పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ హాజరై స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. కొత్తపేటలో 10 ఇళ్లకు వచ్చిన విద్యుత్ బిల్లులను పరిశీలించగా సగటున ప్రతిబిల్లుకు రూ.600 చొప్పున మొత్తం రూ.6 వేలు అదనంగా వచ్చినట్లు చెప్పారు. దీని ప్రకారం సత్తెనపల్లి పట్టణంలో సుమారు 10 వేల కనెక్షన్లు ఉన్నాయనుకుంటే రూ.60 లక్షలను ప్రతినెలా పట్టణవాసుల నుండి ప్రభుత్వం గుంజుతోందని చెప్పారు. గత ప్రభుత్వం కరెంటు బిల్లులు పెంచితే బాదుడే బాదుడు అంటూ కార్యక్రమాలు చేసిన కూటమి, తాము అధికారంలోకి వస్తే బిద్యుత్ ఛార్జీలు పెంచబోమన్న కూటమి ఇప్పుడు ఏం సమాధానమిస్తుందని నిలదీశారు. విల్లులను తగ్గించుకుంటే ఉద్యమం తప్పదన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి డి.విమల, నాయకులు ఆర్.పురుషోత్తం, జె.రాజ్ కుమార్, డి.వెంకటేశ్వర్లు, జి.రజిని, పి.రామారావు, సిహెచ్ ఆంజనేయులు, స్థానికులు అంజనీదేవి, సుజాత, రవి పాల్గొన్నారు.



మేడికొండూరులో పంచాయతీ కార్యదర్శికి సమస్యలపై వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - మేడికొండూరు

మండల కేంద్రమైన మేడికొండూరు, యలవర్తిపాడులో ప్రజాచైతన్య యాత్రలు నిర్వహించారు. పంటలకు ధరల్లేవని, పూర్తిగా నష్టపోయామని పలువురు రైతులు సిపిఎం నాయకుల ఎదుట వాపోయారు. అనంతరం సిపిఎం నాయకులు బి.రామకృష్ణ మాట్లాడుతూ మిర్చిని క్వింటాళ్ రూ.20 వేలకు కొనాలని, కొత్తకౌలురైతు చట్టం తేవాలని, కౌల్దార్లకు పంట రుణాలివ్వాలని, సాగుదార్లకు అన్నదాత సుభీభవ పథకం కింద పెట్టుబడి సాయం అందించాలని కోరారు. అనంతరం ఆయా సమస్యలపై పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఇమామ్ షరీఫ్, సాంబయ్య, కరిముల్లా, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

ఆశా వర్కర్‌ను వేధించిన వారిపై చర్యలు తీసుకోవాలి

సత్తెనపల్లి, పిడుగురాళ్లలో నిరసనలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు వివిధ శాఖల ద్వారా సేవలు అందిస్తున్న చిరు ఉద్యోగులపై వేధింపులు సరికాదని అన్నారు. చాలీచాలని జీతాలతో వెట్టి చాకిరీ చేస్తున్న వారి సమస్యలపై మాట్లాడలేని వారు తొలగించానికి పూనుకోవడం, దారుణంగా బెదిరింపులకు పాల్పడడం దారుణమని అన్నారు. రాజకీయ వేధింపులకు వ్యతిరేకంగా రాబోయే కాలంలో పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని ఆశాలకు పిలుపునిచ్చారు. సాంమ్రాజ్యంను పరామర్శించిన వారిలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, శ్రామిక మహిళ జిల్లా నాయకులు జి.రమణ, ఆశా వర్కర్స్ యూనియన్ పల్నాడు జిల్లా కార్యదర్శి డి.శివకుమారి, గుంటూరు జిల్లా కార్యదర్శి కె.లక్ష్మి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, అమరావతి మండల కార్యదర్శి బి.సూరిబాబు, నాయకులు బి. ముత్యాలరావు బి.లక్ష్మణరావు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు పంతగాని ధనలక్ష్మి, కె.జ్యోతి, రేణుక, ప్రమీల, సుమతి, నాగమణి ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సమీర్ ఉన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి

కూటమి ప్రభుత్వం పాలనలో స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు రోజురోజుకీ పెరుగుతున్నాయని, వీటిని మానుకోవాలని సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు మల్లీశ్వరి డిమాండ్ చేశారు. రెండ్రోజుల కిందట నకరికల్లు మండలం పాపిశెట్టిపాలెంలో అంగన్వాడీ కార్యకర్త ఆత్మహత్య, అమరావతి మండలం ఉంగుటూరులో ఆశా కార్యకర్త ఆత్మహత్యాయత్నం నేపథ్యంలో ఇందకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సత్తెనపల్లి పట్టణంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేశారు. అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన ధర్నాలో మల్లీశ్వరితోపాటు ఐద్వా పట్టణ కార్యదర్శి జి.ఉమశ్రీ, సిఐటియు మండల కార్యదర్శి పి.మహేష్, చేనేత కార్మిక సంఘం నాయకులు ఎ.వీరబ్రహ్మం మాట్లాడారు. రాజీనామా అయినా చేయండి లేకుంటే మేమైనా రాజీనామా చేయించి మా పార్టీకి చెందినవారిని పెట్టుకుంటాం అనే రీతిలో కూటమి నాయకులు బహిరంగంగా స్కీమ్ వర్కర్లను బెదిరిస్తున్నారని విమర్శించారు. వేధింపులు మానుకోకపోతే గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికీ పడుతుందని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు జి.మస్తాన్‌రావు, జి.రజిని, డి.విమల, సుధా, ఆయోష, జి.నాగలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

స్థానిక బంగ్లా సెంటర్ నుండి అంబేద్కర్ బొమ్మ వరకు ర్యాలీ గురువారం నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజకీయ వేధింపుల వల్ల చనిపోయిన అంగన్వాడి షేక్ ఫాతిమా కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అమరావతి మండలంలో రాజకీయ ఒత్తిడికి లోనై ఆత్మహత్యాయత్నం చేసిన సామ్రాజ్యం కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. అంగన్వాడి వర్కర్స్ యూనియన్ పిడుగురాళ్ల ప్రాజెక్టు కార్యదర్శి డి.శాంతమణి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అంగన్వాడీ సమస్యలపై 42 రోజుల సమ్మె జరిగే టిడిపి కూటమి నాయకులు సమ్మె శిబిరం దగ్గరకు వచ్చి మద్దతిచ్చారని, తమ ప్రభుత్వం అధికారంలోకి స్తే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. అయితే వారే నేడు మా పొట్టగొడుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. నిరసనకు ఐద్వా నాయకులు ఎస్.దుర్గాబాయి సంఘీభావం తెలపగా నాగమణి, అరుణ, వాణి, జ్యోతి, బుజ్జి, ఆనంద కుమారి, భారతి, భిక్షాయి, వెంకటలక్ష్మి, శైలజ, చంద్ర, లక్ష్మి, షేక్ బాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక పండరిపురంలో నిరస తెలపగా సిఐటియు మండల కన్వీనర్ పేరుబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడారు. వేధింపులను మానుకోకుంటే గత ప్రభుత్వాలు పట్టిన గతే ఇప్పటి ప్రభుత్వానికీ పడుతుందని హెచ్చరించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు సావిత్రి, పద్మ, ఆశా వర్కర్స్ నాయకులు కె.మరియ పి.శ్రీదేవి, రాజేశ్వరి, ఐద్వా నాయకులు పి.భారతి, సిఐటియు నాయకులు రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో

వివిఐటిలో ఘనంగా థియేటర్స్‌డే

ప్రజాశక్తి - పెదకాకాని

మండల పరిధిలోని నంబూరు గ్రామంలోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాలలో బుధవారం నిర్వహించిన థియేటర్స్ డే వేడుక వీక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. సామాజిక శ్రేయస్సును కాంక్షిస్తూ వినోదం, విజ్ఞానం మేళవింపుతో వివిఐటి విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు అలరించాయి. ఈ వేడుక లో విభాగాల వారీగా ప్రదర్శించిన 8నాటికలను విద్యార్థులు వారి వేషధారణ, హావభావాలతో రక్తికట్టించారు. ఈ కార్యక్రమానికి వర్ధమాన నటుడు, రంగస్థల యువ దర్శకుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వ నందీపురస్కార గ్రహీత రౌతు వాసుదేవరావు న్యాయ నిర్ణేతగా వ్యవహరించగా విజేతలకు వివిఐటి ఛైర్మన్ విద్యాసాగర్ బహుమతులు అందజేసారు. కలలు, ఆశయాలు అందుకునే క్రమంలో ఓ కుటుంబంలో తండ్రి కొడుకుల మధ్య ఏర్పడే అపోహల నేపథ్యంలో ఈఈఈ విద్యార్థులు రూపొందించిన కుటుంబ కథ "అవును మా నాన్న రైతే" ప్రథమ బహుమతి అందుకోగా, రియలెస్టేట్ రంగంలో వినూత్న పోకడలను తెలుపుతూ హాస్యరూ పంలో మెకా నికల్ విద్యార్థులు ప్రదర్శించిన "పుష్పవల్లి నిలయం ద్వితీయ బహుమతి అందుకుంది. ఆచారలు మనిషి లోని మంచితనాన్ని చంపివేయ కూడదంటూ ఈసీఈ విద్యార్థులు రూపొందిం చిన ఓ ఊరు కథ కార్తీక దీపం ప్రత్యేక బహుమతి అందుకుంది. సామాజిక మాధ్యమాలలో పోస్టులు ఇతరుల పై ఏవిధంగా ప్రభావం చూపుతున్నాయో తెలుపుతూ ఐటి విద్యార్థులు ప్రదర్శించిన 'కలియుగంసార్థం' అహంకారంతో మనిషి ఏవిధంగా రూపాంతరం చెందుతాడో తెలుపుతూ ఎస్ అండ్ హెచ్ విధాగం ప్రదర్శించిన " విముక్తి " ధనం బంధాల మధ్య ఏవిధంగా కలహాలు తెస్తుందో తెలుపుతూ సిఎస్ఈ విభాగం ప్రదర్శించిన " జగన్నాటకం" కంప్యూటర్ సైన్స్ స్పెషలైజేషన్స్ విద్యార్థులు ప్రదర్శించిన బానిసత్వాన్ని అంగీకరించని ఓ ధైర్యవంతుడి కథ రామయ్య రాజ్యం, ధర్మానిదే గెలుపు అంటూ సివిల్ విద్యార్థులు ప్రదర్శించిన 'యుగ ధర్మం' వంటి విభిన్ననాటికలు ప్రేక్షకులను ఆలోచింపజేశాయి. ఈ కార్యక్రములో ప్రిన్సిపాల్ డా వై. మల్లికార్జునరెడ్డి, అకడమిక్స్ డీన్ డా కె. గిరిబాబు, అడ్మిన్ డీన్ డా ఎన్. కుమారస్వామి, థియేటర్స్ డే సమన్వయకర్త షేక్. రసూల్ మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

వివిఐటి ఛైర్మన్ విద్యాసాగర్ నుండి బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

రికార్డులను పరిశీలిస్తున్న తహశీల్దార్

డొంక ఆక్రమణలను పరిశీలించిన తహశీల్దార్

ప్రజాశక్తి - తెనాలి : రైతులకు ఉపయోగపడే డొంక ఆక్రమణకు గురైందంటూ వచ్చిన ఫిర్యాదు పై తహశీల్దార్ కె వి గోపాలకృష్ణ బుధవారం విచారణ చేపట్టారు. కొలకలూరు పరిధిలోని డొంకలో దుగ్గిరాల మండలం చింతలపూడి కి చెందిన రైతులు వ్యవసాయం చేస్తున్నారు. అయితే ఆ డొంక ఆక్రమణకు గురి కావడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారంటూ పిజిఆర్ఎస్లో వచ్చిన ఫిర్యాదును ఆయన విచారించారు. ఘటన స్థలానికి చేరుకొని డొంకను పరిశీలించారు. రైతులతో సమస్యపై కూలంకుషంగా చర్చించారు. డొంకను సర్వే చేయించి తదుపరి చర్యలు తీసుకుంటామంటూ రైతులకు వివరించారు. ఆయన వెంట సర్వేయర్, వీఆర్వోలు ఉన్నారు.

ఇంటి స్థలం ఆక్రమణ ఫిర్యాదుపై విచారణ

ప్రజాశక్తి - తెనాలి

తన ఇంటి స్థలం కబ్జా చేసి కొందరు ఇంటి నిర్మాణం చేపట్టారని ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు పై తహసిల్దార్ కెవి గోపాలకృష్ణ బుధవారం విచారణ చేపట్టారు. స్థానిక 32 వ వార్డు నుంచి వచ్చిన ఫిర్యాదును పరిశీలించేందుకు ఆయన వార్డులో పర్యటించారు. ఆరోపణ చేసిన మహిళ ద్వారా వివరాలు తెలుసుకున్నారు. ఆక్రమించి ఇల్లు నిర్మించారన్న ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. ఇరువురి నివేశన స్థల పట్టాలను విచారించి నిర్ణయం తీసుకుంటామని వారికి బదులిచ్చారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఆరోపణలు ఎదుర్కొంటున్న స్థలాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్

హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా విస్మరించిందని వైయస్సార్సీపి మంగళగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ డి వేమారెడ్డి అన్నారు. బుధవారం వైఎస్ఆర్సిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బైపాస్ రోడ్డు లోని నియోజకవర్గ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించి ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. వైఎస్ఆర్సిపి ఆవిర్భవించి 15 సంవత్సరాలు కావస్తుందని అన్నారు.ఈ సుదీర్ఘ కాలంలో పార్టీ నిరంతరం ప్రజలతోనే ఉంది, ప్రజల కోసం పనిచేస్తూనే ఉందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గద్దె ఎక్కినుండి అబద్దాలు చెప్పటమే పనిగా పెట్టుకున్నారు.వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రజలకు చేసిన సంక్షేమ పథకాలన్నీ కూటమి అధికారులకు వస్తే డబల్ చేసి ఇస్తానని అబద్ధపు వాగ్దానాలు చేసి వాటిని నెరవేర్చకుండా తుంగలో తొక్కి ప్రజలను పూర్తిగా మోసం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు నాలి వెంకటకృష్ణ, ఆకురాతి రాజేష్, ఎండి ఫిరోజ్, మల్లవరపు సుధారాణి, సంకే సునీత పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం మాజి శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ పార్టీ జెండా ఆవిష్కరించి కేక్ కత్తిరించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2011లో స్థాపితమై అనేక వొడిదుడుకులు ఎదుర్కొని ప్రజా ఆశీస్సులతో శక్తివంతమైన రాజకీయ పార్టీగా ఆవిర్భవించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ఆవిర్భావ దినోత్సవం వేడుకలు జరుపుకోవడం ఆనందదాయకమని శివకుమార్ తెలిపారు. పేదప్రజల ఆశయ సాధనకు ఆవిర్భవించిన పార్టీని తమ భుజస్కందాలపై మోస్తున్న కార్యకర్తలందరూ గెలుపే లక్ష్యంగా పనిచేయాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. పార్టీకి పూర్వ వైభవం సాధించేలా కష్టపడాలని కార్యకర్తలకు సూచించారు.

మామపై గొడ్డలితో దాడి చేసిన అల్లుడు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మామ పై అల్లుడు గొడ్డలితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ సంఘటన సత్తెనపల్లి మండలం డిడి పాలెం సమీపంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ ఘటనలో బత్తుల గంగరాజు అతని కుమారుడు వీర్రాజులు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం అచ్చంపేట మండలం కొండూరు గ్రామానికి చెందిన శివగంగను సత్తెనపల్లి మండలం దీపాల దిన్నిపాలెం గ్రామానికి చెందిన పిల్లకతుపుల గంగయ్యతో సుమారు 8 నెలల క్రితం వివాహం జరిగింది. గంగయ్య కు రెండో వివాహం కాగా శివగంగది మొదటి వివాహం. వివాహం జరిగిన మూడు నెలల నుండి ఇద్దరు మధ్య గొడవలు జరుగుతున్నాయి. తరచూ భార్య శివ గంగను గంగయ్య హింసిస్తున్నాడు. పెద్ద మనుషుల సమక్షంలో రాజీ కుదిరించారు. బుధవారం భార్య భర్తల మధ్య గొడవ జరగడంతో శివగంగను తీవ్రంగా కొట్టడంతో చేతులు విరిగాయి. దీంతో తండ్రి గంగరాజుకు ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పింది. రెంటపాళ్ళ సమీప పొలాల్లో గొర్రెలను మేపుతున్న గంగయ్యను గంగరాజు అతను కొడుకు వీర్రాజుతో కలిసి గంగయ్యని నిలదీశారు. ఈ క్రమంలో ఘర్షణ చోటుచేసుకోవడంతో గంగయ్య చేతిలో ఉన్న గొడ్డలితో గంగరాజు వీర రాజులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. తీవ్రంగా గాయపడిన గంగరాజు వీర్రాజు శివగంగలను 108 వాహనం ద్వారా సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తీవ్రంగా గాయపడిన గంగరాజు శివగంగలను ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. గంగరాజు పరిస్థితి విషమంగా ఉంది. బాధితులు సత్తెనపల్లి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జనరల్ నోటీసు
మహారాజశ్రీ గుంటూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
S. O. P.No. 7/ 2025

బిట్వీన్:
1) చావల సుభాషిని,భర్త.వెంకట స్వామి,
2) చావల మాధవ చంద్ర వర్ధన్, తండ్రి.వెంకట స్వామి,
3) ఆనంద్ సత్య వర్ధన్ చావల, తండ్రి.వెంకట స్వామి
4) చావల సౌమ్య దీప్తి, తండ్రి.వెంకట స్వామి,
అందరి నివాసం:డోర్ నెం.4-119/9, లయోలా పబ్లిక్ స్కూల్ ఎదురు, నల్లపాడు, అంకిరెడ్డి పాలెం, గుంటూరు (రూరల్ మం & జిల్లా) ... పిటిషనర్స్

వర్సెస్

1) టెక్ మహీంద్రా ప్రైవేట్ లిమిటెడ్., ముంబై,2) లింక్ ఇన్ టైమ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, పూణే,. .....రెస్పాండెంట్స్

పై ఉదాహరించిన S.O.P. నందు 1 వ పిటిషనర్ కి భర్త గారు మరియు 2 నుండి 4వ పిటిషనర్స్ కి తండ్రి గారైన చావల వెంకట స్వామి గారు జీవించి వున్నా కాలంలో 1వ రెస్పాండంట్ వారి కంపెనీలో షేర్స్ (Folio No. 0001175, Certificate No 418, 3254 గల 940 షేర్స్ కొనుగోలు చేసి మరణించిన దరిమల వారి వారసులు సదరు షేర్స్ నిమిత్తం వారసత్వ సర్టిఫికెట్ కొరకు పిటిషన్ దాఖలు చేయగా సదరు శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఈ జనరల్ నోటీసు ద్వారా తెలియపరచుచున్నాము, కనుక సదరు పిటిషన్ పై ఏమైనా అక్షపణలు వున్న యడల, అక్షేపణలు వున్న వారు సదరు పై ఉదాహరించిన శ్రీ కోర్టు వారి ఎదుట ది:01-04-2025న ఉ. గం. 10-30ని.లకు హాజరై వారికి గల అక్షేపణలు తెలుపకొన గలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్ష మందు విచారించి తీర్మానించబడును.

వాయిదా:01-04-2025

చేబ్రోలు సత్యనారాయణ (బాలాజీ),
పిటిషనర్స్ తరపు అడ్వకేట్,
గుంటూరు. సెల్: 9247111252

NOTICE
UNDER ORDER 21 RULE 54(IA) CPC
మహారాజశ్రీ పర్చూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
EP No. 21/2020
in
OS No. 82/2017

Between:-
లంకా వెంకట సుబ్బారెడ్డి ......DHR
మరియు
లంకా శ్రీనివాసరెడ్డి(died) వగైరాలు ......JDRs

To
JDR2. లంకా మాధవి W/o లేటు శ్రీనివాసరెడ్డి
JDR3. లంకా సంజన D/o లేటు శ్రీనివాసరెడ్డి
JDR4. లంకా అనిరుధ్ S/o లేటు శ్రీనివా సరెడ్డి
All are R/o పట్టాభిపురం, 3/1 లైన్,
Near Old RTO ఆఫీస్, సత్యదేవ అపార్ట్ మెంట్,
ప్లాట్ నెం. 501, గుంటూరు.

పై నంబరు గల EPని మీపై దాఖలు చేసి మీకు ఎన్ని మార్లు నోటీసులు పంపిననూ చేరనందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా ది.18-03-2025న ఉదయం 10.30 ని.లకు వాయిదా ఉన్నందున మీరు స్వయముగా గాని వకీలు గారి ద్వారా గాని పై కోర్టువారి ఎదుట హాజరయి మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది లేనియెడల మీ పరోక్షమున పిటీషన్ విచారించి తీర్మానించబడును.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా తేది :- 18-03-2025

ఇట్లు
రావి సత్యనారాయణ
రావి శ్రీనివాసరావు
CH శ్రీ రమణి
న్యాయవాదులు, పర్చూరు.

Notice Under Order 5, Rule 1&5 of C.P.C
శ్రీదరిశి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No.372/2022

దారం అనురాధ ...వాది
Vs
గరికపాటి బాపారావు ... ప్రతివాది

ప్రతివాది :
గరికపాటి బాపారావు తండ్రి నరసయ్య
R/o మణికంఠ జనరల్ స్టోర్స్, మెయిన్ రోడ్, 9వ లైన్, ముత్యాల రెడ్డి నగర్, గుంటూరు టౌన్, గుంటూరు జిల్లా.

పై నెంబరున వాది మీపై దావా పరిహార నిమిత్తం దావా దాఖలు చేయగా శ్రీ కోర్టు వారు మీకు నోటీసు నిమిత్తం తేదీ:14-04-2025నకు వాయిదా వేసినారు. గాన మీరు వాయిదా రోజు ఉదయం 10.30 గంటలకు స్వయంగా గాని, లాయర్ గారి ద్వారా గాని పైకోర్టువారి ఎదుట హాజరై నీ ఆక్షేపణలు తెలియచేసుకొనగలరు. లేనియెడల నీ పరోక్షమున దావా తీర్మానించబడునని తెలియ చేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా తేది: 14-04-2025

ఇట్లు
మానం రామాంజనేయులు,
వాది తరపు న్యాయవాది,
దరిశి, ప్రకాశం జిల్లా.
సెల్: 9032270354

ప్రకటన
మహారాజశ్రీ తెనాలి 1వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో (గుంటూరుజిల్లా.)
ఇ.పి. 33/22 ఇన్ ఓ.యస్. 650/2016

బిట్వీన్ :
బొమ్మిశెట్టి భ్రమరాంబ .... డిహెచ్ఆర్
వర్సెస్
మునగాల ఠాగూర్ శివ ప్రకాష్‌గాంధీ వగైరాలు .... జెడిఆర్స్

టు :
ఆర్ 2 : రంగా కాంతిశ్రీ భర్త : విజయకుమార్, డోర్ నెం. 7-5-55, నియర్ ఎ.ఎస్.ఎన్. కాలేజీ, గంగానమ్మ పేట, తెనాలి.
ఆర్ 5 : మునగాల దినేష్ గాంధీ తండ్రి : సాంబశివ సూర్యనారాయణ, జి3, లేక్‌వ్యూ కాలనీ, ప్రగతినగర్, హైదరాబాద్.

పై నెంబరు ఇ.పి.లో మీకు శ్రీ కోర్టువారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను అనేక పర్యాయములు నోటీసులు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు చేయవలసినదిగా పై కోర్టువారు ఆర్డరు వేస్తూ ది. 18-3-2025వ తేదీకి వాయిదా వేసివున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, మీ తరపున న్యాయవాది ద్వారా గానీ హాజరు కాగలరు. లేనిచో ఇ.పి.ని మీ పరోక్షంలో తీర్మానం చేయబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా : 18-3-2025

ఇట్లు
యం.కె.దీనదయాళ్
డిహెచ్ఆర్ తరపు అడ్వకేట్,
సెల్ : 9490451232

GENERAL NOTICE
IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE, TNEALI
I.P. No. 41/2024

Between :
Mudraboini Srikanth S/o Malleswara Rao, Tenali .... Petitioner/ Debtor
AND
1) Rajendra Jewellers, Rep by its Managing Partner, Santhi Lal
2) అడిగొప్పుల మురళీకృష్ణ
3) లాటి రాజశేఖర్
4) పెనుమాక శోభారాణి
5) పొనుగుపాటి రవిచంద్ర
6) తాడిబోయిన శేషుకుమార్
7) దివి దుర్గా శ్రీనివాసరావు
8) గాలి క్రాంతి
9) పెనుమాక మధు
..... Respondents/ Creditors

పై నెంబరు ఐ.పి.లో పిటీషనర్ తనను ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని కోరుతూ పిటీషన్ దాఖలు చేయగా సదరు పిటీషన్‌పై ఎవరికైనా అభ్యంతరాలు వుంటే తెలుపుకోవాలని శ్రీ కోర్టువారు జనరల్ నోటీసుకు ఆర్డరు వేస్తూ మీ హాజరు నిమిత్తం ది. 15-3-2025వ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, మీ తరపు న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టువారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల సదరు పిటీషన్‌ను మీ పరోక్షమున విచారించి తీర్మానించ బడునని యావన్మందికి తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)

వాయిదా : 15-3-2025

తెనాలి.

ఇట్లు
కంచర్ల కోటేశ్వరరావు,
పిటీషనర్ తరపు న్యాయవాది,
తెనాలి. సెల్ : 9989228041.

GENERAL NOTICE
IN THE COURT OF THE HON'BLE ADDL. SENIOR CIVIL JUDGE :: TENALI
I.P. NO. 3 /2025

Between :
Meruga Sudha Rani ....Petitioner
Vs
1. Shaik Dada Vali,, Tenali
2. Tenali Ravi Varma, S/o Babu Rao Tenali
3. AXIS Bank Limited, repby its Branch Manager, Ranigunji branch
4. Incread Financial Services Limited, rep by Branch Manager, Somajiguda
5. Finzy-bridge Fintech Solutions, rep by its Branch Manger Koramangala Branch.
.... Respondents

పై నెంబరు ఐ.పి.లో పిటీషనరు తనను ఇన్సాల్వెంట్గా డిక్లేర్ చేయమని కోరుచూ పిటీషను దాఖలు చేయగా, సదరు పిటీషనుపై ఎవరికైనా అభ్యంతరములు వుంటే తెలుపుకోమని శ్రీ కోర్టువారు జనరల్ నోటీసుకు ఆర్డరు వేస్తూ మీ హాజరు నిమిత్తము ది.17-3-2025వ తేదీకి వాయిదా వేసి యున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 ని॥ లకు మీరు స్వయంగా గాని, మీ తరపు న్యాయవాది ద్వారా గాని శ్రీ కోర్టు వారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటీషన్ను మీ పరోక్షమున విచారించి, తీర్మానించబడునని యావన్మందికి తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)

వాయిదా:: 17-3-2027

ఎం.పి.భీమేశ్వర్,
తలతోటి సుధాకర్,
పిటీషనర్ తరపు అడ్వకేట్స్, తెనాలి
సెల్ నెం. 9133331157

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-ఈపూరు

స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్‌లో చేరేందుకు విద్యార్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సునీల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపిసి, ఎంఈసి, సిఇసి గ్రూపులు ఉన్నాయని, ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు http://apms.apcfss.in,http://.cse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు రుసుం చెల్లించి దరఖాస్తు చేయాలని, మే 22వ తేదీ వరకు అవకాశం ఉందని పదవ తరగతి మార్కుల మెరిట్, రిజర్వేషన్ ప్రకారం సీట్ల భర్తీ ఉంటుందతెలిపారు.

27న చలో విజయవాడను

జయప్రదం చేయాలని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం పిలుపు

ప్రజాశక్తి - వినుకొండ

ఎపిఎస్ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం 27న నిర్వహించే చలో విజయవాడను జయప్రదం చేయాలని ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పిలుపినిచ్చింది. డిపో ఆవరణలోని సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎం.రామసుబ్బయ్య, వి.ఆనందం మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులకు లీవ్ ఎన్‌క్యాష్మెంట్ నగదు ఇప్పటి వరకు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షనర్ మరణిస్తే నామినీగా ఉన్న అతని భార్యకు జీవితాంతం పెన్షన్ చెల్లించాల్సి ఉన్నా పుట్టిన తేదీలో మార్పు జరిగిందని, పేరులో కొన్ని అక్షరాలు తేడాగా ఉన్నాయంటూ చెల్లించడంలో జాప్యం చేస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. నిబంధనలను సడలించి ఆర్టీసీ రికార్డులను ఆధారం చేసుకుని పెన్షన్ చెల్లించే ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కె.హనుమయ్య, ఎస్‌కె.సైదా, కె.మస్తాన్ పాల్గొన్నారు.

ఫీజు బకాయిల పాపం వైసిపిదే

తెలుగు యువత ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు ఎన్నడూ సకాలంలో చెల్లించని వైసిపి 'యువత పోరు' పేరుతో బుధవారం చేపట్టిన ఆందోళన పట్ల యువత విద్యార్థులు, ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారని, వైసిపి హయాంలో విద్యార్థుల ఇబ్బందులను పట్టించుకోని నాయకులు ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసం రోడ్డు ఎక్కడం విడ్డూరంగా ఉందని నరసరావుపేట నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు యేసుగంటి భార్గవ్‌సాయి విమర్శించారు. నరసరావుపేటలోని టిడిపి జిల్లా కార్యాలయంలో బుధవారం వారు విలేకర్లతో మాట్లాడారు. గత ప్రభుత్వం రూ.4720 కోట్ల ఫీజు బకాయిలు చెల్లించలేదన్నారు. జిఒ 77 అమలు చేసి విధానాన్ని అస్తవ్యస్తం చేసి ఇప్పుడు అదే విధానం రద్దు చేయాలనడం విడ్డూరంగా ఉందన్నారు. వైసిపి అమలు చేసిన విధానంతో కళాశాలలకు, ప్రభుత్వానికి మధ్య ఆర్థికపరమైన అంశాలలో సంబంధం లేకుండా పోయిందన్నారు. ఫీజులు కళాశాలకు నేరుగా ప్రభుత్వం చెల్లించే విధానంలో జాప్యం జరిగినా యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి చేసేవి కాదన్నారు.

విద్యార్థులు, యువతను దగా చేసిన కూటమి

- ఫీజు రీయింబర్స్మెంట్, నిరుద్యోగ భృతిపై వైసిపి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- కలెక్టరేట్‌లో జెసికి వినతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విద్యార్థులకు ఫీజు బకాయిలు, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగులకు భృతి సమస్యలపై వైసిపి ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక గుంటూరు రోడ్డులోని వైసిపి నియోజకవర్గ కార్యాలయం నుండి వైసిపి జిల్లా కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వైసిపి కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఎగురవేసి వై.ఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూల మాల వేసి నివాళు లర్పించారు. అనంతరం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైసిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ యువత పోరు కార్యక్రమానికి స్వచ్ఛందంగా యువత తరలిరావడం ప్రభుత్వ వ్యతిరేకతకు నిదర్శనమన్నారు. హామీలు అమలు చేయకుండా 9 నెలల్లో ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని, విద్యార్థులు, యువతను గాలికొదిలేసిందని దుయ్యబట్టారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటుందన్నారు. విద్యాదీవెన, వసతి దీవెనకు గతేడాది రూ 3,200 కోట్లు, ఈ ఏడాది రూ.3,900 కోట్లు మొత్తం రూ.7,100 కోట్లు చెల్లించాల్సి ఉంటే బడ్జెట్‌లో రూ.2,644 కోట్లు కేటాయించి చేతులు దులిపేసుకున్నారని విమర్శించారు. మాజీ మంత్రి విడదల రజినీ, మాజీ ఎమ్మెల్యేలు బొల్లా బ్రహ్మనాయుడు, కాసు మహేష్‌రెడ్డి, నంబూరి శంకర్రావు, సత్తెనపల్లి ఇంచార్జ్ డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ నిరుద్యోగ భృతి పేరుతో నెలకు రూ.3 వేలు చెల్లిస్తామని చెప్పి యువత ఓట్లు దండుకుని, అధికారంలోకి వచ్చాక ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని అన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో సైతం దీని ఊసే లేదని, ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నాయి

చేతులెత్తి ఆమోదాన్ని తెలుపుతున్న గ్రామస్తులు

పంచాయతీగా విజయపురిసౌత్‌కు గ్రామస్తుల ఆమోదం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌లో అంతర్భాగమైన విజయపురిసౌత్‌ను నూతన పంచాయతీగా ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో అధికారులు గ్రామస్తులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. పంచాయతీ ఏర్పాటుతో జరిగే అభివృద్ధి గురించి గ్రామస్తులకు వివరించారు. స్థానిక ఎన్నికలు నిర్వహణ, విద్యుత్, ఇంటి స్థలాలు వంటి అంశాలపై చర్చించారు. స్థానికులు తమ అభిప్రాయాలను అధికారుల ఎదుట వ్యక్తం చేశారు. విజయపురిసౌత్‌ను పంచాయతీగా ఏర్పాటు చేయాలని అంశాన్ని గ్రామస్తులు ఆమోదించారు. కార్యక్రమంలో ఈఓపిఆర్డీ కోటేశ్వరరావు, ప్రాజెక్ట్ ఎఈ హిమబిందు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా 3 శనివారం ప్రతిష్టాత్మకంగానిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు ఈనెల నిర్వహించనున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొనాలని, ముందు రోజు రాత్రి ఆయా మండలాలకు వెళ్లి రాత్రి బస చేయాలని అన్నారు. స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులను, ప్రజలను భాగస్వామ్యం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

గిన్నిస్ రికార్డులోకి షేక్ అబ్దుల్లా

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణానికి చెందిన పరుగుల వీరుడు షేక్ అబ్దుల్లా మరో రికార్డును సొంతం చేసుకున్నాడు. గతనెల 24న 0.30 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్న ప్రాంతంలో జరిగిన 42 కిలోమీటర్ల మారథాన్‌లో ప్రతిభ చూపారు. ప్రతికూల వాతావరణం, అలవాటు లేని ప్రాంతంలో అనారోగ్యం పాలైనా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని విజయవంతంగా ముగించాడు. భారతదేశం నుండి పాల్గొన్న 80 మందిలో ఆంధ్రప్రదేశ్ నుండి ప్రాతినిధ్యం వహించిన అబ్దుల్లా గడ్డ కట్టిన మంచుపై 42 కిలోమీటర్లను 06 గంటలలో పూర్తిచేసినందుకు గిన్నిస్ వరల్డ్ రికార్డులో ఆయన పేరును నమోదు చేసినట్లు ఓ ప్రకటనలో తెలిపాడు. ఈ నెల 29న ఎస్ఐబి స్పోర్ట్స్ ఆధ్వర్యంలో బెంగళూరులో జరిగే 24 గంటల పరుగు పందెంలో 210 కిలోమీటర్ల ఎఫ్ఐఏ పరుగు పందెంలో పాల్గొనేందుకు ఇండియా రికార్డు కోసం ముందుకు వెళుతున్నట్లు తెలిపాడు. తనకు ఆర్థికంగా సహాయ, సహకారాలు అందిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపాడు.

టిడ్కో ఇళ్లయినా ఇస్తాం.. డబ్బులు తిరిగైనా చెల్లిస్తాం..

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ ప్రశ్నకు సమాధానంగా చైర్మన్, కమిషనర్

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలో టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లను ఇవ్వాలని, లేనిపక్షంలో వారు చెల్లించిన నగదును తక్షణమే వారికి తిరిగివ్వాలని కౌన్సిలర్ సుభాని డిమాండ్ చేశారు. చైర్మన్ పోలూరి నరసింహారావు అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం జరిగింది. ఎజెండాలోని 42 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. కౌన్సిలర్ సుభాని మాట్లాడుతూ అభివృద్ధి పనులకు తక్షణమే టెండర్లు వేసి పనులను ప్రారంభించేటట్లు చూడాలని కోరారు. ఆవులు బెడదను పూర్తిస్థాయిలో నివారించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు వివరించారు. ప్లాస్టిక్ కవర్లు విచ్చలవిడిగా వాడుతున్నారని, వెంటనే అరికట్టాలని కోరారు. చైర్మన్‌తోపాటు కమిషనర్ వేణుబాబు సమాధానమిస్తూ టిడ్కో గృహాల సంబంధించి జిల్లా కలెక్టర్‌కు వివరించామని, కలెక్టర్ నివేదిక రాగానే లబ్ధిదారులకు తిరిగి నగదును ఇవ్వటం లేదా, గృహాలు కేటాయించడం చేస్తామని చెప్పారు. గతంలో సుమారు 65 ఆవులు రోడ్లపై సంచరించేవని, వాటిలో 50 ఆవులను మున్సిపల్ పార్కుకు తరలించి, ఆవుల యజమానులను పిలిపించి, మొదటి తప్పిదంగా రూ.500 జరిమానా విధించి వదిలిపెట్టామని చెప్పారు. మిగతా ఆవులను కూడా త్వరలో గోశాలలకు తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్లాస్టిక్ కవర్లు నివారించేందుకు వ్యాపారస్తులతో అవగాహన కార్యక్రమం చేపట్టి నివారణకు కృషి చేస్తామన్నారు. ఇప్పటికే కవర్లు విక్రయించే విక్రయదారులను గుర్తించి జరిమానా విధించామని చెప్పారు. రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి సూచనల మేరకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు చైర్మన్ చెప్పారు. మరో కౌన్సిలర్ గట్ల అరుణకుమారి మాట్లాడుతూ పురపాలక సంఘ కార్యాలయానికి వచ్చే మహిళలకు మూత్రశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. నెహ్రూ నగర్‌లోని ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో మినీ పార్కులు ఏర్పాటుచేసి మొక్కలు నాటాలని సూచించారు. వేసవి దృష్ట్యా తక్షణమే చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. హౌసింగ్ డిఈ బాలాజీ నాయక్ మాట్లాడుతూ స్థలం ఉండి గృహాన్ని నిర్మించుకునే లబ్ధిదారులకు గతంలో ప్రభుత్వం నుండి రూ.1.80 లక్షలు వచ్చేవని, ఇప్పుడు ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు మరో రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు పెంచినట్లు తెలిపారు. స్థలం ఉండి కొత్తగా ఇల్లు కట్టుకునేవారు ఈనెల 31 లోపు తమ పేర్లను హౌసింగ్ కార్యాలయాల్లో ఆన్‌లైన్ చేసుకోవాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాలకు అదనపు సాయం : జిల్లా కలెక్టర్

జిల్లాలో 14,112 గృహాలకు లబ్ధి- నిర్మాణంలో ఉన్న ఇళ్లకు అదనపు నిధులు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పిఎంఎవై) పథకం కింద మంజూరై, నిర్మాణం పూర్తి కాని ఇళ్లకు ప్రభుత్వం ఆదనపు సాయం అందించనుంది. స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా జిల్లాలో 2029 నాటికి అందరికీ గృహ నిర్మాణం అనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయం అందిస్తుందని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. 2024 డిసెంబర్ 10 నాటికి నిర్మాణ దశలో ఉన్న ఇళ్లకు మాత్రమే ఈ సాయం వర్తించనుంది. జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీలో నియోజకవర్గాల్లో 14,112 మంది లబ్ది చేకూరనున్నది. ఇందులో భాగంగా నిర్మాణాలు పూర్తి చేసుకోవ టానికి ఎస్సీ, బిసి లబ్దిదారులకు రూ.50వేలు, ఎస్టీ లబ్దిదారులకు రూ.75వేలు, అత్యంత వెనుకబడిన గిరిజనులకు రూ.1 లక్ష అందిస్తారు. ఈనెల 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకూ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వార్డు ఎమినిటీ సెక్రెటరీలు, అర్హత కలిగిన ప్రతి ఇంటిని తనిఖీ చేసి, లబ్దిదారులకు అవగాహన కల్పించనున్నారు. ఇంటి ఫోటోను తీసుకుంటున్నారు.

నియోజకవర్గాల వారీగా లబ్దిదారులు

ప్రత్తిపాడు	2361
తాడికొండ	2611
పొన్నూరు	2628
తెనాలి	4709
మంగళగిరి	1029
గుంటూరు తూర్పు	292
గుంటూరు పశ్చిమ	482
మొత్తం	14,112

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం కల్పించిన ఈ సౌకర్యాన్ని గృహ నిర్మాణ లబ్దిదారులు వినియోగించుకోవాలి. నిర్మాణాలు పూర్తి చేసిన తర్వాత వెంటనే బిల్లులు సమర్పించాలి. అధికారులు ప్రజాప్రతినిధులకు ఈ విషయాన్ని తెలియజేసి విస్తృత ప్రచారం కల్పించాలి. లబ్దిదారుడు వెంటనే ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవటానికి హౌసింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలి.

కార్పొరేట్‌కు దీటుగా 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి : మంత్రి లోకేష్

ప్రజాశక్తి మంగళగిరి : మంగళగిరి సమీపంలోని చినకాకాని వద్ద ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన వంద పడకల ఆసుపత్రి కార్పొరేట్ హాస్పటల్ కు దీటుగా అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. మంగళగిరిలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణంపై అధికారులతో బుధవారం మంత్రి లోకేష్ సమీక్షించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... శంకుస్థాపన రోజు నుండి ఏడాదిలోగా పనులు పూర్తయ్యేలా లక్ష్యం పెట్టుకొని పక్కా ప్రణాళికతో పనులు చేపట్టాలని అన్నారు. మంగళగిరి హాస్పటల్ నిర్మాణం దేశంలోనే అత్యుత్తమంగా ఉండేలా చేపట్టాలని సూచించారు. మంగళగిరి నియోజకవర్గ నలుమూలల నుంచి హాస్పటల్ కు వచ్చే పేషెంట్లు, వారి బంధువులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సీటింగ్

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేష్

ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసర రోగులకు అవసరమైన లిఫ్ట్ సదుపాయం, విశాలమైన వాహనాల పార్కింగ్ ఉండాలని సూచించారు. గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ కలిపి 1,14,075 చదరపు అడుగుల్లో విశాలంగా ఈ హాస్పటల్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. జాతీయస్థాయిలో పేరెన్నికగన్న ఆసుపత్రుల తరహాలో నిర్మాణాలు చేపట్టాలి. ఆసుపత్రిలో వైద్య సేవలు పొందేందుకు ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. డాక్టర్లు, పేషంట్లు, విజిటర్స్ కు సౌకర్యవంతంగా ఉండేలా జోన్లు ఉండాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఏపీఎమ్ ఎస్ఐడీసీ(ఆంధ్రప్రదేశ్ వైద్య విద్య, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ) చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, సీఈ జి.సుధాకర్ రెడ్డి, ఎస్ఈ వి.చిట్టిబాబు, ఈఈ సీవీ రమణ, భార్గవ్ గ్రూప్ అధినేత భార్గవ్, భార్గవ్ గ్రూప్ చీఫ్ ఆర్చిటెక్చర్ నిఖిల, ఏపీఎమ్ఎస్ఐడీసీ డీఈఈ ఎమ్. హనుమంతరావు నాయక్, ఏఈ జి.గోపీచంద్, ఏఈ కె.శివ సత్యనారాయణ, భార్గవ్ గ్రూప్ డీజీఎమ్ ఏ.శ్యామ్ కిషోర్, సీనియర్ ఇంజనీర్ డి.అనిల్ కుమార్ పాల్గొన్నారు.

వ్యర్థాలు డ్రెయిన్‌లోకి వెళ్లకుండా మెష్‌లు ఏర్పాటు చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

హోటల్ వ్యర్థాలు డ్రైన్‌లోకి వెళ్లకుండా యాజమాన్యాలు మెష్‌లు ఏర్పాటు చేసుకోవాలని, లేదంటే చర్యలు తీసుకుంటా మని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. కమిషనర్ బుధవారం రైలుపేట, జిజిహెచ్ ఎదుట రోడ్, డ్రైన్ల ఆక్రమణలు, హెూటల్ వ్యర్థాలు డ్రైన్లలోకి రావడం గమనించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రైల్వేస్టేషన్, ప్రభుత్వ వైద్యశాలకు అధిక సంఖ్యలో ప్రజలు రాకపోకల సాగించటం వల్ల ఈ రోడ్డులో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. అలాగే హోటళ్ల వ్యర్థాలు నేరుగా డ్రైన్లలోకి వదలటం వల్ల మురుగు కాల్వలు బ్లాక్ అవుతున్నాయని, దుర్గంధం వ్యాపిస్తుందన్నారు. వ్యర్థాలు డ్రైన్‌లోకి వెళ్లే మార్గంలో తప్పనిసరిగా మెష్‌లు

జిజిహెచ్ వద్ద పర్యటించిన కమిషనర్, కార్పొరేటర్

ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆయా ప్రాంతాల్లో రోడ్లు, డ్రైన్లు ఆక్రమించి ట్రాఫిక్ సమస్య సృష్టిస్తున్నారని, ఆక్రమణలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. పర్యటనలో డిఈఈలు నాగభూషణం, మధుసూదన్, ఎస్ఎస్ ఆయుబ్ ఖాన్, కార్పొరేటర్ పి.సమత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక కుటుంబాలకు అండగా ఉంటాము...

కార్మికుల కుటుంబాలకు గుంటూరు నగర పాలక సంస్థ అండగా ఉంటుందని, కార్మికులకు అందాల్సిన పరిహారాలు వెంటనే అందిచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఇంజినీరింగ్ విభాగం ఔట్‌సోర్సింగ్ కార్మికులు కె.శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు కళ్యాణికి రూ.2 లక్షల ఎక్స్ గ్రేషియా చెక్‌ను బుధవారం కమిషనర్ చాంబర్‌లో అందజేశారు. పిఎఫ్ కూడా త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారుల్ని ఆదేశించారు.

కెఎల్‌యును సందర్శించిన ఆస్ట్రేలియా ప్రతినిధి

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

ఆస్ట్రేలియా లోని సిడ్నీ పట్టణంలో ఉన్న యూనివ ర్సిటీ ఆఫ్ టెక్నాలజీ సిడ్నీ (యుటిఎస్) ప్రతినిధి డాక్టర్ సెబాస్టియన్ కుంట్జ్ బుధవారం నాడు కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీని సందర్శించారని విదేశీ సంబంధాల డీన్ డాక్టర్ కిషోర్ బాబు తెలియజేశారు. యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థులు, పరిశోధన రంగంలో పనిచేస్తున్న ప్రొఫెసర్ల విషయమై కే ఎల్ యూనివర్సిటీతో ఒక ఒప్పందానికి సంబంధించిన ప్రతిపాదనలపై చర్చల కోసం వారు వచ్చారని డాక్టర్ కిషోర్ బాబు అన్నారు. విద్యా విషయక అంశాలలో అకడమిక్స్ డీన్ ప్రొఫెసర్ హరికిరణ్ తో చర్చలు జరిగాయని పేర్కొన్నారు. యుటీ ఎస్ మరియు కే ఎల్ యూ లమధ్య గల పాఠ్య ప్రణాళికల లో అంతరాన్ని గుర్తించి ఇరువైపుల చదువుకునే విద్యార్థులకు సమగ్ర పాఠ్యాంశ బోధనకై ఒక ఒప్పందానికి వచ్చినట్లు వారు వెల్లండించారు. తదనంతరం రిసెర్చ్ రంగంలో సహకారాన్ని విస్తృతం చేయడానికై రిసెర్చ్ విభాగ డీన్ ప్రొఫెసర్ బీటీ పీ మాధవ్ డాక్టర్ కుంట్జ్‌తో చర్చించారని ప్రస్తుతం రెండు యూనివర్సిటీలలో జరుగుతున్న పరిశోధనలలో ఒకేలాంటి అంశాలపై పనిచేస్తున్న ప్రొఫెసర్లను గుర్తించడానికి తద్వారా పరస్పర సహకారంతో పరిశోధనలను విస్తృత పరచడానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. చర్చలకు సమన్వయకర్తలుగా విదేశీ సంబంధాల డైరెక్టర్ విజయమారుతి, డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ గోపి కృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులు దేశభక్తి, క్రమశిక్షణ అలవర్చుకోవాలి

నంబూరు జడ్‌పి హైస్కూల్లో భారత్ స్కాట్స్ అండ్ గైడ్స్ ట్రూప్ ఏర్పాటు

ప్రజాశక్తి - పెదకాకాని

విద్యార్థుల్లో క్రమశిక్షణ దేశభక్తి సేవాభావం పొందించడానికి స్కౌట్ అండ్ గైడ్ ఉద్యమం ఎంతగానో ఉపయోగపడుతుందని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ గుంటూరు జిల్లా సెక్రెటరీ ప్రధానోపాధ్యాయులు ఏం. ఏడుకొండలు తెలిపారు. బుధవారం నంబూరు జడ్‌పి హెచ్ హైస్కూల్లో బాల,బాలికలకు వేర్వేరుగా స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రూప్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు విషయాలను తెలిపారు. గైడ్‌కెప్టెన్‌గా స్వరూపరాణి ఆధ్వర్యంలో బాలికలకు సావిత్రిబాయిపూలే యూనిట్, బాలురకు మాస్టర్ సత్యన్నారాయణ కెప్టెన్‌గా బాలురకు జ్యోతిరావు పూలే స్కౌట్ ట్రూప్ ను పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడు కొండలు, ఎంఇఒ శంకర్ రాజు, ప్రధానోపాధ్యాయులు డి.విజయ్ కుమార్, కొండయ్య స్కౌట్ వ్యవస్థాపకులు బ్రెడెన్ పౌల్ చిత్రపటానికి పూలమాలనేసి నివాళులర్పించారు. నూతనంగా చేరిన 38 మంది విద్యార్థులకు స్కౌట్ యూనిఫామ్ బహుకరించడం జరిగింది. వీరితో డి ప్రసన్నకుమారి, డిస్టిక్ సెక్రటరీ ప్రమాణం చేయించి స్కౌట్ లోకి ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా సెక్రెటరీ ఏం. ఏడుకొండలు మాట్లాడుతూ దేశంలో విపత్కర పరిస్థితిల్లో సేవ చేయటం కోసం పాల్గొనటానికి ముందుకు రావాలని సూచించారు. ఎంఇఒ శంకర్ రాజు మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ లో విద్యార్థులు శారీరిక దారుఢ్యంతో పాటు దేశభక్తి సేవాభావం ఆలవడుతుందన్నారు. స్కౌట్ విద్యార్థులకు ఇంజనీరింగ్ వైద్య విద్యలో తదితర కోర్సు లో అడ్మిషన్స్ లో రైల్వే ఉద్యోగాల్లో రిజర్వేషన్ సౌకర్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ ఈమని ప్రతాపరెడ్డి పూర్వ విద్యార్థి సంఘ నాయకుడు మరియు యల్ నాగరాజు ఉపాధ్యాయులు డి.విజయ్ కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో లెదర్ పార్కులు ఏర్పాటు చేయాలి

చర్మకారుల సమస్యలపై జూన్‌లో రథయాత్ర

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్రంలో లెదర్ పార్కులకు స్థలాలు కేటాయించి ఉన్నాయని, ప్రభుత్వం చొరవ తీసుకొని లెదర్ పార్కులు నిర్మాణంకు ముందుకు రావాలని, ఆంధ్రప్రదేశ్ చర్మకార సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు అన్నారు. రాష్ట్రంలో చర్మకార సమస్యలపై రాష్ట్ర పర్యటనలో భాగంగా ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల పర్యటనలు ముగించుకొని బుధవారం మంగళగిరి వచ్చిన ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో చర్మకార సమస్యలపై మూడు విడతలుగా 19 జిల్లాలు పర్యటించడం జరిగిందని, నాలుగవ విడతగా ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాలు పర్యటించడం జరిగిందన్నారు. నెల్లూరు జిల్లా పర్యటిస్తే రాష్ట్రవ్యాప్తంగా పర్యటన పూర్తవుతుందన్నారు. ఆయా జిల్లాలోని కలెక్టర్లను చర్మకారులతో కలిసి సమస్యలను వివరించామని, కలెక్టర్లు సానుకూలంగా స్పందించడం సంతోషంగా ఉందన్నారు. ఇటీవల రాష్ట్ర మంత్రి నారా లోకేష్ నైజీరియా దేశస్థులతో జరిపిన చర్చలలో వారు లెదర్ పార్కులు నిర్మాణంకు ఆర్థిక సహకారం ఇస్తామని ప్రకటించడం హర్షనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్ లోని అన్ని జిల్లాలలో లెదర్ పార్కులకు స్థలాలు కేటాయించి ఉన్నాయని, అయితే నిర్మాణం చేయవలసి ఉందన్నారు. జూన్ నెలలో చర్మకారుల సమస్యలపై చర్మకార రథయాత్ర ప్రారంభించి 175 నియోజకవర్గాలు పర్యటించడం జరుగుతుందన్నారు. చర్మకారుల రథయాత్ర మంగళగిరి నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అధ్యక్షులు ముసుకుడి రాము, జిల్లా నాయకులు ముసుకుడి సురేష్, సంసోన్, తాడికొండ నియోజకవర్గ ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అధ్యక్షులు చీలి మస్తాన్, దళితులు నాయకులు బూసి గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సెబాస్టియన్ కుంట్జ్‌ను సత్కరిస్తున్న డీన్ డాక్టర్ కిషోర్ బాబు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ క్యాంపస్ సెలక్షన్స్‌లో

22 మంది జువాలజీ విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జువాలజీ-ఆక్వాకల్చర్ విభాగంలో బుధవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు జరిగాయి. ఆల్ఫా మెరైన్ ష్రిమ్ప్ ప్రాసెసింగ్ యూనిట్ ఈ ఇంటర్వ్యూలను నిర్వహించారు. అందులో భాగంగా విద్యార్థులను వివిధ అంశాలపై ఇంటర్వ్యూ నిర్వహించారు. తద్వారా 22 మందిని ఎంపిక చేశారని విభాగాధిపతి ఆచార్య వి. వెంకటరత్నమ్మ తెలిపారు. ఇందులో 7మంది బాలికలు, 15 మంది బాలురు ఉన్నారు. వీరు క్వాలిటీ కంట్రోల్ ఉద్యోగులుగా విధులు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఇన్చార్జి విసి ఆచార్య కే. గంగాధర రావు, ఇన్చార్జి రెక్టర్ ఆచార్య కే. రత్న షీలా మణి, ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం తదితరులు అభినందనలు తెలియజేశారు.

రైతులంతా విశిష్ట గుర్తింపు కార్డు పొందాలి

మొక్కజొన్న పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రైతులకు సమగ్ర యాజమాన్య పద్ధతులను వివరించి వ్యవసాయాన్ని లాభసాటి చేసేందుకు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా వనరుల కేంద్రం డిడిఎ ఎం.శివకుమారి చెప్పారు. నరసరావుపేట మండలం గురవాయిపాలెం, పెట్లూరివారిపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. మిర్చి, మొక్కజొన్న, అపరాల పంటలను పరిశీలించి రైతులకు పలు సలహాలిచ్చారు. అనంతరం రైతుసేవా కేంద్రాల్లో రైతులతో సమావేశమయ్యారు. ఎడిఎ పి.మస్తానమ్మ మాట్లాడుతూ డ్రోన్ ద్వారా పంటలపై పురుగు మందుల పిచికారి, హోం కంపోస్టింగ్, కిచెన్ గార్డెన్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి వి.నరేంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేస్తున్న విశిష్ట గుర్తింపు సంఖ్యతో రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. ఇంతకాలం ఆధార్ కార్డు ప్రామాణికంగా పథకాల మంజూరయ్యేవని, అయితే పథకాలు, రాయితీలు మరింత పారదర్శకంగా ఉండేందుకు 11 అంకెలతో కూడిన విశిష్ట నంబర్ ఇస్తున్నట్లు చెప్పారు. దీనివల్ల సమగ్ర సమాచారం డిజిటలైజ్ అవుతుందన్నారు. రైతు సేవా కేంద్రాల్లో రైతులు దరఖాస్తు చేసుకున్న వెంటనే విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలని సూచించారు. ఆధార్ కార్డు, పొలం పాసు పుస్తకం, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్‌ను తీసుకొని రైతుసేవా కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ కార్యదర్శులు షాహిర్‌బాబు, మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - నాదెండ్ల

ప్రకృతి వ్యవసాయం వల్ల భూమి సారవంతమై ప్రధాన పంటలకు కావాల్సిన సూక్ష్మపోషకాలు వృద్ధి చెందుతాయని ప్రకృతి వ్యవసాయం పల్నాడు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి చెప్పారు. మండలంలోని గణపవరం రైతుసేవా కేంద్రంలో రైతులతో బుధవారం సమావేశం నిర్వహించారు. అమలకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందొచ్చని చెప్పి సాగు విధానాలను వివరించారు. 30 రకాల విత్తనాలతో పీఎండీఎస్ (ప్రీ మాన్ డ్రైసోయింగ్) పద్ధతిని పాటిస్తే భూములు సారవంతం అవుతాయని, కలుపు నివారణ అవుతుందని, జరుగుతుంది, భూమిలో కర్బన శాతం పెరుగుతుందని చెప్పారు. మండల వ్యవసాయ అధికారి వెంకట నరసయ్య మాట్లాడుతూ రాజుపాలెం మండల పరిధిలో ఎక్కువగా రైతులు మిరప పంటను సాగు చేస్తున్నారని, దీనికి రక్షణగా జొన్న సజ్జ, అంతర్ పంటలుగా ఉల్లి, బంతి, ముల్లంగి, క్యారెట్, ఆముదం, పంటలు వేస్తున్నారని అక్కడి అనుభవాలను తెలిపారు. ఎపిఎం శివకుమార్ మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రతి రైతు వారికున్న మొత్తం భూమిలో (పి ఎం డి ఎస్) విధానం ఆచరించాలని, డ్వాక్రా మహిళలు తమ ఇంటి పరిసర ప్రాంతాల్లో కిచెన్ గార్డెన్ ఉండేవిధంగా చూడాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ రైతులైన ప్రణతి, నర్రా మల్లికార్జునరావును సన్మానించారు. టిడిపి నాయకులు పెద్దిరాజు, బాబురావు, సిబ్బంది పాల్గొన్నారు.

గణపవరంలో మాట్లాడుతున్న అమలకుమారి

కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంసిపిఐయు నాయకులు

వీధి దీపాల్లేక మందుబాబులకు అడ్డాగా..

టిడ్కో గృహ సముదాయ సమీపంలో వీధి దీపాల కోసం వినతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణ సమీపంలోని 1500 టిడ్కో గృహాలతో పాటు 700 వరకు ఇళ్లున్నాయని, అయితే ఆ మార్గంలో వీధి దీపాలు లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారి రాకపోకలకు ఇబ్బంది కరంగా ఉందని ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి రెడ్ బాషా అన్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్‌కు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. రోడ్డుపై పాములు సంచరిస్తున్నాయని, తక్షణమే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, మందు బాబులను నియంత్రించాలని కోరారు. టిడ్కో ఇళ్ల సమీపంలో ఉన్న రైల్వేట్రాక్ వైపు ప్రహరీ నిర్మించాలన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో అలీమ్ ఖాన్, మహబూబ్ బాషా ఉన్నారు.

మాట్లాడుతున్న దుర్గాభవాని

మహిళలకిచ్చిన హామీల విస్మరణ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మహిళా దినోత్సవం స్ఫూర్తికి ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవాని అన్నారు. మహిళా సమాఖ్య ఏరియా సమితి ఆధ్వర్యంలో స్థానిక ఎన్ఆర్‌టి సెంటర్‌లోని సిపిఐ కార్యాలయలో బుధవారం మహిళా దినోత్సవం నిర్వహించగా దుర్గాభవాని మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణం, తల్లికివందనం హామీలను విస్మరించారని, మహిళలపై దాడులు జరుగుతున్నా నియంత్రించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కె.జయమ్మ మాట్లాడుతూ మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి సాధించాలన్నారు. మహిళలకు హక్కులు, స్వేచ్ఛ, రక్షణ కల్పనలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. సభకు అధ్యక్షత వహించిన మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల మాట్లాడుతూ మహిళలకు మనువాదం కాదని, అందరివాదం కావాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎ.మారుతీ వరప్రసాద్, నాయకులు టి.బాబురావు, సుభాని, దుర్గ, డి.వరహాలు పాల్గొన్నారు.

అన్ని పశువులకూ టీకాలు వేయించండి

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలో పశువులకు చేపట్టిన గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పల్నాడు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కాంతారావు బుధవారం పరిశీలించారు. జాలాది, ఉన్నవ, యడ్లపాడు గ్రామాల్లో పర్యటించి పశుపోషకులతో మాట్లాడారు. పశువులన్నింటికీ టీకాలు వేయించాలని సూచించారు.

విద్యుత్ మీటర్ల తనిఖీల్లో పాల్గొన్న విద్యుత్, విజిలెన్స్ అధికారులు, సిబ్బంది

విద్యుత్ వినియోగదార్లకు రూ.5.96 లక్షల జరిమానా

ప్రజాశక్తి - నకరికల్లు

విద్యుత్ శాఖ, విజిలెన్స్ అధికారులు బృందాలుగా ఏర్పడి మండలంలోని గుండ్లపల్లి, చల్లగుండ్ల, కుంకలగుంట, కండ్లకుంట, నకరికల్లు, చేజర్ల, చాగల్లు, శాంతినగర్, నర్సింగపాడు గ్రామాల్లో బుధవారం తనిఖీలు చేపట్టారు. 49 మంది అధికారులు, 183 మంది సిబ్బంది, 49 బృందాలుగా 2806 సర్వీసులను తనిఖీచేసి 137 మందికి రూ.5.96 లక్షలు అపరాధ రుసుం విధించినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సిహెచ్.వెంకటేశ్వరరావు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ డి.వెంకన్న చౌదరి, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాంబోట్లు, డిఇలు కె.రవికుమార్, మల్లికార్జున ప్రసాదు, వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఈలు కోటేశ్వరరావు, చంద్రశేఖర్, సతీష్ కుమార్, శివశంకర్, ఆపరేషన్ ఏఈ షేక్ గౌస్ పాల్గొన్నారు.

బొమ్మరాజుపల్లిలో పి4 సర్వే

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని బొమ్మరాజుపల్లి గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన పి4 సర్వేలో భాగంగా సచివాలయ సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ వివరాలను నమోదు చేస్తున్నారు. బుధవారం సర్వేను ఈఓపిఆర్డి నాగేండ్ల రత్నం పర్యవేక్షిస్తూ ఇళ్ల వద్దకు వెళ్లి పి4 సర్వే పై అవగాహన కల్పించారు. గ్రామస్తులు సర్వేకు సహకరించాలని ఆయన కోరారు.

తాగునీటి పథకాలు, ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

అసెంబ్లీలో కోరిన జీవీ ఆంజనేయులు - మూడేళ్లలో చేస్తామన్న మంత్రి నారాయణ

ప్రజాశక్తి - వినుకొండ



తాగునీటి పథకాలు, టిడ్కో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణకు ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. పల్నాడు జిల్లాలోని వినుకొండ, పిడుగురాళ్ల, మాచర్ల, చిలకలూరిపేట సహా అనేక పట్టణ ప్రాంతాలు వాటి పూర్తి కోసం ఎదురు చూస్తున్నాయని బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆంజనేయులు ప్రస్తావించారు. అమృత్ పథకం కింద రూ.8,500 కోట్లు మంజూరవగా కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతంతో పనులు చేయాల్సి ఉందని, కేంద్రం రూ.600 కోట్లు ఇచ్చినా గత జగన్ ప్రభుత్వం రూపాయి కూడా ఇవ్వకపోవడంతో పనులు నిలిచాయని చెప్పారు. టిడ్కో ఇళ్లనూ అంతే చేశారని, కనీసం 10 శాతం పనులు కూడా చేయకుండా పాడుపెట్టారని అన్నారు. దీనికి మంత్రి స్పందిస్తూ మూడేళ్లలో ఈ పనులన్నీ పూర్తి చేస్తామన్నారు.

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని బిసి, కాపు (కాపు, బలిజ, తెలగ, ఒంటరి) ఈబిసి, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్లకు సంబంధించిన రాయితీ రుణాల కోసం ఈ నెల 22 లోగా ఆన్‌లైన్‌లో ఏపిఓబిఎంఎంఎస్ నందు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. బి ఫార్మసీ, డి ఫార్మసి చేసిన నిరుద్యోగ బిసి, ఈ డబ్ల్యూ ఎస్ అభ్యర్థులు జనరిక్ ఫార్మసీలకు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు నరసరావుపేటలోని బిసి కార్పొరేషన్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

వాహనాల వెనుక రేడియం స్టిక్కర్లు తప్పనిసరి

ప్రజాశక్తి - మాచర్ల

వాహనాల వెనక భాగాన రేడియం స్టిక్కర్లను తప్పనిసరిగా అంటించాలని పట్టణ సిఐ ప్రభాకరరావు అన్నారు. సిఐ ఆధ్వర్యంలో ఎస్ఐ సంధ్యారాణి, కానిస్టేబుల్స్ బుధవారం స్థానిక రింగ్ రోడ్ సెంటర్ వద్ద వాహనాలు తనిఖీలు చేపట్టారు. రేడియం స్టిక్కర్లు లేని వాహనాలను గుర్తించి డ్రైవర్లచే స్టిక్లర్లు అంటింపజేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ రెండ్రోజుల క్రితం రాత్రి సమయంలో వెల్దుర్తి వద్ద రోడ్డుపై ఆగివున్న ట్రాక్టర్ వెనుక భాగాన బైక్ ఢీ కొట్టిందని, ఈ ప్రమాదంలో తండ్రి కుమార్తెలు ఇద్దరు దుర్మరణం పాలయ్యారని చెప్పారు. ప్రమాదానికి కారణం ఆగివున్న ట్రాక్టర్ వెనుక భాగాన రేడియం స్టిక్కర్లు లేకపోవటమేనని, అదే సిక్కర్లు వుంటే బైక్ లైట్ దానిమీద పడగానే స్టిక్కర్ మెరుపుతో అక్కడ ట్రాక్టర్ ఉన్నదని అర్థమయ్యేదని తెలిపారు. ప్రమాదాల నివారణకు తప్పని సరిగా వాహనాల వెనుక భాగాన రేడియం స్టిక్కర్లు అంటించాలని, లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

డ్రైవర్‌తో ఆటోకు రేడియం స్టిక్కర్ అంటింపజేస్తున్న సిఐ

99వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

కార్మిక ప్రజా సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం ఉలుకు పలుకు లేకుండా ఉందని సిఐటియు, సిమెంట్ ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు విమర్శించారు. తమకు న్యాయం జరగవలసిన నష్టపరిహారం కోసం ఏ సి సి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు బుధవారం నాటికి 99 వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో వై సుబ్బారావు, బి జోజప్ప, జి కొండ, బి దానయ్య, కె హగ్గయ్య కూర్చున్నారు. దీక్షలను సిఐటియు పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, కొర్రపాటి ఆదినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలన్నీ పరిష్కారం చేశామని ప్రచారం చేసుకుంటున్నా ప్రభుత్వం, వంద రోజుల నుండి పిల్ల పాపలతో తమ గోడు వినమని, తమ సమస్యను పరిష్కరించమని కోరుతున్న పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం ఆశీర్వాదం, గురవయ్య, ఎస్ కే భాష, డి మాణిక్యరావు, ఎండి ఇస్మాయిల్, ఆర్ ఇస్రాయెల్, వై సాంబయ్య, బి సూర్యప్రకాశరావు, వై యహెూస్వ, వై రమాదేవి, టి దుర్గా భవాని, ఎం శివకుమార్, డి మల్లేశ్వరి, వి రిబ్కా, ఈ సారమ్మ, ఎం శారద, యు కాశమ్మ, బి అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ నేరం - నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ అన్నపూర్ణ

ప్రజాశక్తి - తెనాలి

లింగ నిర్ధారణ నేరమని, అందుకు భిన్నంగా వ్యవహరించే స్కాన్ సెంటర్లపై చట్ట ప్రకారం చర్యలుంటాయని జిల్లా ఉప వైద్యాధికారిణి డాక్టర్ ఇ అన్నపూర్ణ చెప్పారు. గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం పై తెనాలి డివిజన్ స్థాయి సలహా సంఘం సమావేశం పాత ప్రభుత్వ వైద్యశాల ఆవరణలోని కార్యాలయంలో బుధవారం ఆమె సమావేశం నిర్వహించారు సింహ ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశంలో భ్రూణ హత్యలను అరికట్టేందుకు, దేశంలో క్షీణిస్తున్న లింగ నిష్పత్తిని నిరోధించడానికి భారత ప్రభుత్వం 1994లో ఈ చట్టం తీసుకొచ్చిందని చెప్పారు. గర్భస్థ శిశువు ఆడ, మెగా అనే విషయం బయటకు వెల్లడించడం సరికాదన్నారు. స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్ పత్రం, స్కానింగ్ ధరలు, హాస్పిటల్ ఫీజుల పట్టిక అందరికీ కనిపించే విధంగా ప్రదర్శించాలని, లింగ నిర్ధారణ ఎట్టి పరిస్థితుల్లోనూ చేయమని బోర్డులు ప్రతి స్కాన్ సెంటర్లో ఉండాలన్నారు. సమావేశంలో ప్రభుత్వ వైద్యశాల వైద్యులు డాక్టర్ హరిణి, డాక్టర్ సురేష్, డాక్టర్ వినీల్ ,సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునీల్ కుమార్ ,రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ ఎం భానుమతి, ఎన్ శ్రీమన్నారాయణ, పి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

తీసుకున్న సొమ్ముకు రెట్టింపు వసూలు

క్రెడిట్ కార్డు తీసుకోకుండా ఉండటమే ఉత్తమం : ఎస్ఐ నాయక్

ప్రజాశక్తి - మంగళగిరి

ఇటీవల కాలంలో క్రెడిట్ కార్డ్ వలన మోసపోయి అనేకమంది పోలీస్ స్టేషన్ కు చేరుతున్నారని బుధవారం మంగళగిరి పట్టణ ఎస్సై నాయక్ తెలిపారు. క్రెడిట్ కార్డ్ ఇస్తామంటూ చెప్పిన వారి మాటలను నమ్మవద్దని ఆయన సూచించారు. తీసుకున్న సొమ్ముకు రెట్టింపు వసూలు చేస్తారని అన్నారు. కొన్నిసార్లు మనకు తెలియకుండానే క్రెడిట్ కార్డ్ హ్యాక్ అవుతుందని, పోయిన సొమ్మును క్రెడిట్ కార్డు ఉన్నవాళ్లు చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. కొందరు లక్షల్లో కోల్పోతున్నారని, బ్యాంకర్లు సైతం తమకేమీ సంబంధం లేదని చేతులెత్తేస్తున్నారని బాధితులు చెబుతున్నట్లు చెప్పారు. ఈ తరహా ఫిర్యాదులు ఇటీవల కాలంలో ఎక్కువగా వస్తున్నాయని పేర్కొన్నారు. క్రెడిట్ కార్డు వలన మోసపోయిన వారు ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక కార్యాలయం కూడా లేదని అన్నారు. ఈ నేపథ్యంలో క్రెడిట్ కార్డును వినియోగించేవారు అప్రమత్తంగా ఉండాలని ఒకరకంగా చెప్పాలంటే క్రెడిట్ కార్డును తీసుకోకుండా ఉండటమే మేలని నేడు సైబర్ మోసాలను చూస్తుంటే అర్థమవుతుందని ఆయన సూచించారు.



ఘనంగా చైతన్య హైస్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

ఆత్మకూరు చైతన్య హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు పెదకాకాని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రావిపాటి వెంకట శివరామయ్య, సిందే లక్ష్మీనారాయణ ముఖ్య అతిథు లుగా విచ్చేశారు. శివరామయ్య మాట్లాడుతూ మ్యాథ్స్‌లో ప్రాథమిక విషయాలను విద్యార్థులకు సులభ పద్ధతులలో ఉపాధ్యాయులు నేర్పించాలని, అందువల్ల విద్యార్థులు మ్యాథ్స్ అంటే భయం పోయి వేగంగా లెక్కలు చేయగలుగుతారని అన్నారు. భాను ప్రసాద్ మాట్లాడుతూ మంచి స్నేహితులు దొరకడం వారితో విద్యకు సంబంధించిన అంశాలను చర్చించుకోవడం వలన అవి ఎప్పటికీ మర్చిపోరని అన్నారు. మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులలో ఒత్తిడిని తగ్గించడం కోసమే రాష్ట్రవ్యాప్తంగా బాలోత్సవాలు నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో సిందే లక్ష్మీనారాయణ, సందుపట్ల భూపతి, అల్లక తాతారావు తదితరులను ముఖ్య అతిథులు సత్కరించారు.

కీటక జనిత వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - తెనాలి

పురపాలక సంఘ పరిధిలోని యడ్ల లింగయ్య కాలనీలో బుధవారం కీటక జనిత వ్యాధులపై అవగాహన

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న తహశీల్దార్, మలేరియా సిబ్బంది

కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ అవగాహన కోసం ఇంటింటికి పంపిణీచేస్తున్న కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది సూచనలను ప్రజలు ఆచరించాలన్నారు. ప్రజలకు అవగాహన నిమిత్తం మలేరియా సిబ్బందితో కలిసి జీవించి ఉన్న లార్వాలను ప్రజలకు చూపించారు. దోమల వలన వ్యాపించే వ్యాధులు ఇతర సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ సిబ్బంది ఎస్ ఉమాకాంత్, ఎ బాలచంద్రమౌళి, మల్లేశ్వరరావు, శివ నాగ మల్లేశ్వరరావు, షేక్ రషీద్ , కరిముల్లా, కామేశ్వరరావు, గౌస్, స్థానికులు పాల్గొన్నారు.

నేడు, రేపు మంత్రి లోకేష్ మంగళగిరి పర్యటన

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ 13, 14 తేదీలలో మంగళగిరి, ఎర్రబాలెం గ్రామంలో పర్యటిస్తున్నట్లుగా నియోజకవర్గం టిడిపి నాయకులు బుధవారం తెలిపారు. 13వ తేదీన సాయంత్రం 4:30 గంటలకు వీజే కాళాశాల వద్ద టీడీపీ పాలకమండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి నూతనంగా ఏర్పాటు చేస్తున్న శ్రీ సన్ ఫ్లవర్ హ్యాండ్లూమ్స్‌ను ప్రారంభిస్తారు. అదే రోజు అర్ధరాత్రి 12 గంటలకు శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణ మహోత్సవంలో సతీ సమేతంగా పాల్గొంటారని తెలిపారు. 14వ తేదీన ఉదయం 10 గంటలకు ఎర్రబాలెం గ్రామంలో పునరుద్ధరించిన గోశాలను ప్రారంభిస్తారని,. 14వ తేదీన మధ్యాహ్నం 3:30 గంటలకు శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్య రథోత్సవంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - తాడేపల్లి

ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు వరంగా మారిందని తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు అన్నారు. బుధవారం తాడేపల్లి పట్టణంలో పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను కూటమి నాయకులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. 11వ వార్డుకు చెందిన మహమ్మద్ మోహిద్దీన్‌కు రూ. 3,79,570, 16వ వార్డుకు చెందిన తుమ్మురు ఆదిలక్ష్మికి రూ. 1,20,000 లక్షలు, 17వ వార్డుకు చెందిన సూరగని నవ్య భారతికి రూ. 1,03,919 లక్షలు, 6వ వార్డుకు చెందిన వేముల భూలక్ష్మికి 82729 వేలు, 3వ వార్డుకు చెందిన బత్తిన శ్రీనివాసరావుకు రూ. 54150 వేలు, 19వ వార్డుకు చెందిన నూడగల మౌనికకు రూ. 30 వేలు, 20వ వార్డుకు చెందిన షేక్ బాషా రూ 20,524 వేల విలువైన చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా వల్లభనేని వెంకట్రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించి ఎంతో మందికి ఆర్థికంగా చేదోడుగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో దారదాసు, ఇట్టా భాస్కర్, కేలి వెంకటేశ్వరావు, అద్దంకి మురళి, గాడి సాంబశివరావు, పోతాబత్తిన శ్రీనివాసరావు, పుష్పాంజలి, బకా లావణ్య, ఓలేటి రాము,గణేష్ రావు, సిహెచ్ భార్గవ్, దేవళ్ల ప్రసాద్. తురక దుర్గారావు నాగరాజు తాడి బోయిన గోపి, గణేష్, చిన్నా దుర్గారావు, షేక్ చాంద్ బాషా, షేక్ ఇలియాజ్, కొల్లూరు లక్ష్మణ, యశోద, కంభం సాయిచంద్, తాడేపల్లి కిరణ్, తాడిబోయిన గోపి, గంటి వంశీ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరిలోని కేకే మున్సిపల్ హై స్కూల్ లో బుధవారం పదవ తరగతి విద్యార్థులకు వినుకొండకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయ దంపతులు వేములపాటి లక్ష్మీ సామ్రాజ్యం- నాగేంద్ర తల్లిదండ్రులు సుబ్బయ్య - చెంచమ్మ జ్ఞాపకార్థం ఎగ్జామ్ కిట్స్ పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులందరూ పదవ తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దర్యావలి తదితరులు పాల్గొన్నారు.

పంపిణీలో పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ బృందం

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - తెనాలి

త్వరలో 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో స్థానిక ఐతానగర్ ఎన్ ఎస్ ఎస్ ఎం హై స్కూల్లో విద్యార్థులకు అట్టలు, పెన్నులు, స్కేల్స్ పంపిణీ చేశారు. మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిడుబ్రోలు కృష్ణవేణి వాటర్ ప్లాంట్ వారి సహకారంతో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ బి లక్ష్మీపతి పాల్గొనగా, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లె బోయిన తేజ, ట్రెజరర్ తిరుమల శెట్టి ఉమా శంకర్, పోలిశెట్టి విజయకుమార్ చేతుల మీదుగా మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయుని రాజ్యలక్ష్మి, బెల్లంకొండ వెంకట్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పచ్చదనం పై అధికారులతో చర్చిస్తున్న ఎడిసి ఛైర్ పర్సన్ లక్ష్మీపార్థసారథి

పచ్చదనం పెంపొందించేలా చర్యలు

ఎడిసి ఛైర్ పర్సన్ లక్ష్మీపార్థసారథి

ప్రజాశక్తి - తుళ్లూరు

ఉష్ణోగ్రతలు తగ్గించి పచ్చదనాన్ని పెంపొందించేలా తగు చర్యలు తీసుకోవాలని అమరావతి అభివద్ధి కార్పొరేషన్ (ఎడిసి) ఛైర్ పర్సన్ డి లక్ష్మీ పార్థసారధి అధికారులను ఆదేశించారు. రాజధాని అమరావతి నగరానికి అతి పెద్ద ప్రధాన రహదారి అయిన సీడ్ యాక్సెస్ రహదారి ఇరుపక్కలా పచ్చదనాన్ని తీర్చి దిద్దాలని అన్నారు. బుధవారం ఆమె సీడ్ యాక్సెస్ రోడ్డు ఇరువైపులా పచ్చదనంను పెంపొందించేందుకు జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వేసవి కాలం దృష్ట్యా అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునే మొక్కలను నాటి వాటిని సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సీడ్ యాక్సెస్ సెంట్రల్ మీడియన్ మీద డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థను ఏర్పాటు చేసి మొక్కలకు సమద్ధిగా నీరిందించాలని జైన్ ఇరిగేషన్ ప్రతినిధి జితేంద్రకు ఆదేశాలు జారీచేశారు. అనంతరం ఎన్-9 రోడ్డుపై బఫర్ జోన్ అభివృద్ధి పరిచేందుకు ప్రణాళికలు రచించాలని ఉద్యానవన అధికారులను ఆదేశించారు.ఎడిసి నిర్మాణం చేపడుతున్న రహదార్లపై ఎక్కడా నీటి నిల్వలకు తావులేకుండా చూడాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎడిసి జనరల్ మేనేజర్ కె శ్రీహరిరావు,ఛీఫ్ ఇంజినీరు ఎం ప్రభాకరరావు,ఉద్యానవన విభాగాధిపతి విఎస్ ధర్మజ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పింఛన్లు మినహా మిగతా హామీల అమలేది?

సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

ప్రజాశక్తి - తెనాలి

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో రూ. 4వేలు పెన్షన్ మినహా మిగిలిన వాటి పరిస్థితి ఏమిటని సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ ప్రశ్నించారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. కూటమి పార్టీలు తాము అధికారంలోకి వస్తే ఆడపిల్లలకు నెలకు రూ. 1500, నిరుద్యోగ యువతకు రూ 3వేలు, బీసీ మహిళలకు ప్రతి సంవత్సరం రూ. 15వేలు ఆర్థిక సహాయం అందజేస్తామని చెప్పారని గుర్తు చేశారు. వారు చెప్పిన హామీల ప్రకారం రూ 4వేలు సామాజిక భద్రతా పింఛన్లు మినహా, ఏ ఒక్క హామీ అమలు కావటం లేదని అన్నారు. జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పడంతో యువత అంతా ఓట్లు వేశారని, కానీ జాబ్ క్యాలెండర్ జాడే లేదని విమర్శించారు. ఎన్నికల ముందు వాలంటీర్లను కొనసాగిస్తామని చెప్పి, పైగా రూ. 15వేలు జీతం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రెండు లక్షల పైగా వాలంటీర్లను తొలగించారని ఆరోపించారు గిట్టుబాటు ధర లేక మిర్చి రైతులు రోడ్లపై ధర్నాలు చేస్తున్నారని, పంటలను కల్లాల వద్ద తగలబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి రైతుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న మిర్చికి గిట్టుబాటు ధర కల్పించి, రైతులకు ముందస్తు పెట్టుబడి సాయం అందించాలని, హామీలన్నిటిని నెరవేర్చాలని అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ డివిజన్ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడేపల్లి : కొన్ని దశాబ్దాలుగా రైల్వే,ఫారెస్ట్ పిడబ్ల్యుడి,కొండ పోరంబోకు భూముల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీలు వెనుకబడిన వర్గాల అందరూ జీవిస్తూ ఉన్నారని సిపిఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య అన్నారు.బుధవారం సాయంత్రం తాడేపల్లి నులకపేటలో నివాసముంటున్న పేద ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కాశయ్య, మాట్లాడుతూ ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం 5 లక్షల ఇస్తామని చెప్పిందని అయితే ఆ ఇళ్ళు కట్టుకోవడానికి పట్టా కావాలని పట్టా లేకుండా ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం డబ్బులు ఇవ్వదని బ్యాంకులు లోన్లు ఇవ్వరని అన్నారు. రైల్వే, ఫారెస్ట్, ఇరిగేషన్, కొండ పోరంబోకు స్థలాల్లో నివసిస్తూ వారందరికీ గతంలో చంద్రబాబు,లోకేష్ చెప్పినట్లు పట్టణాల్లో రెండు సెంట్లు రూరల్ మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి శాశ్వతంగా పట్టాలు ఇవ్వాలని చెప్పి సిపిఐ పోరాటం చేస్తుందని అన్నారు.

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం : డిఇఒ రేణుక

హాజరు కానున్న 31,543 మంది విద్యార్థులు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక తెలిపారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డిఇఒ రేణుక, జిల్లా అబ్జర్వర్ సి.పార్వతి మీడియా సమావేశంలో పరీక్షల ఏర్పాట్లు గురించి వివరించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ ఈనెల 17 నుండి 31వ తేదీ వరకూ పరీక్షలు ఉంటాయన్నారు. రంజాన్ పండుగ సెలవు 31వ తేదీ ఉంటే ఆరోజు జరగాల్సిన పరీక్ష ఏప్రిల్ 1వ తేదీన ఉంటుందన్నారు. ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ పరీక్ష ఉంటుందన్నారు. 150 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. రెగ్యులర్ విద్యార్థులు 29,449 మంది, ఒకసారి ఫెయిల్ అయిన విద్యార్థులు 961 మంది, ఓపెన్ స్కూల్ విద్యార్థులు 1133 మంది మొత్తం 31,543 మంది పరీక్షలకు హాజరు అవుతున్నారన్నారు. అన్ని పరీక్షా కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్లను, డిపార్ట్‌మెంట్ అధికారుల్ని నియమించామన్నారు. ఆరు సమస్యాత్మక కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. విద్యార్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రంలోకి తీసుకురాకూడదన్నారు. హాల్ టిక్కెట్ చూపిస్తే ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించిందని తెలియజేశారు. విద్యార్థులకు పరీక్షలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా 9951397109, 9052343447 నంబర్లలో సంప్రదించాలన్నారు. అబ్జర్వర్ పార్వతి మాట్లాడుతూ పరీక్షలకు ముందస్తు ఏర్పాట్లు అన్ని సక్రమంగా ఉండేలా చూస్తున్నామన్నారు. పరీక్షా కేంద్రాల్లో బెంచీలు, వెలుతురు, త్రాగునీరు, ప్రాథమిక వైద్య చికిత్స కిట్లు, పారామెడికల్ సిబ్బంది, బందోబస్తు వంటి అన్ని ఏర్పాట్లు పరిశీలిస్తున్నామన్నారు. హాల్ టిక్కెట్లలో విద్యార్థుల పేర్లు, తల్లిదండ్రుల పేర్లు, ఇంటి పేర్లు ఇతర వివరాలు అన్నీ సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలన్నారు. సమావేశంలో పరీక్షల ఏసీ వెంకటరెడ్డి, సీనియర్ హెచ్‌ఎం తిరుమలేష్, ఉర్దూ డిఐ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఇఒ రేణుక

విద్యార్థుల సమస్యలపై 15న నిరసన దీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 15న విజయవాడ, ధర్నా చౌక్ వద్ద రాష్ట్ర స్థాయి నిరసన దీక్షలను నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యం.కిరణ్‌కుమార్, షేక్. సమీర్ తెలిపారు. బుధవారం బ్రాడిపేటలోని ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో దీక్షలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్, తల్లికి వందనం, విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలు పెద్ద ఎత్తున పేరుకుపోయాయన్నారు. తక్షణమే బకాయిలు విడుదల చేయాలని, తల్లికి వందనం విడుదల చేయాలని కోరారు. ఎపి కామన్ పీజీ సెట్‌ను రద్దు చేయాలని, జిఒ 77ను రద్దు చేయాలని, వెటర్నరీ విద్యార్థులకు రూ.25వేలు స్టైఫండ్ ఇవ్వాలని, ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలని తదితర డిమాండ్లపై జరుగుతున్న ఈ దీక్షలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి యశ్వంత్, నగర సహాయ కార్యదర్శి సుభాని, నగర గర్ల్స్ కన్వీనర్ సౌమ్య, జిల్లా కమిటీ సభ్యులు శ్రావణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

గుంటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

వైసిపి ఆధ్వర్యంలో నగరంలో భారీ ర్యాలీ

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న రూ.4600 కోట్లు ఫీజు బకాయిలు, వసతి దీవెన బకాయిలు వెంటనే విడుదల చేయాలని లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు అన్నారు. బకాయిల కోసం రాష్ట్రవ్యాప్తంగా యువత పోరు కార్యక్రమంలో భాగంగా గుంటూరులో యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత వైసిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక పట్టాభిపురంలోని స్వామిథియేటర్ వద్ద ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం అక్కడి నుండి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించి, కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా యువతకు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. విద్యార్థులకు రూ.4600 కోట్లు బకాయిలు ఉంటే బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు కేటాయించారన్నారు. నిరుద్యోగ యువతకు భృతి నెలకు రూ.3వేలు ఇస్తామని చెప్పారని, ఎవరైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతికి బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా మోసం చేశారన్నారు. 20 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని చెప్పారని, ఒక్కటైనా సృష్టించారని అని ప్రశ్నించారు. పేదల విద్య కోసం జగన్ ప్రభుత్వం నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటు పరం చేస్తుందని విమర్శించారు. అదే విధంగా ప్రభుత్వం వైసిపిలో యాక్టివ్‌గా ఉన్న వారిపై తప్పుడు కేసులు పెడుతుందని, పోసాని కృష్ణమురళిపై 17 కేసులు పెట్టి రిమాండ్‌కు పంపించారని, కొన్నింటిని క్వాష్ చేసిందని, కొన్నింటికి బెయిల్ ఇచ్చిందన్నారు. నేడు రిలీజ్ కావాల్సి ఉండగా లోకేష్ రాత్రికి రాత్రి ఇంకో కేసు పెట్టించాడన్నారు. ఏమిటీ దుర్మార్గం అన్నారు. అనవసరంగా కేసులు పెడుతున్నారని, వెంటనే రిలీజ్ చేయాలని కోర్టు స్పష్టం చేసిందన్నారు. అన్యాయంగా అక్రమంగా కేసులు పెడితే ప్రజలు, న్యాయస్థానాలు సహించరు అని అన్నారు. దీనికి మూల్యం చెల్లించాల్సిన అనివార్యమైన పరిస్థితి లోకేష్‌కు వస్తుందన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు లేళ్ల అప్పిరెడ్డి, మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, అంబటి మురళి, నూరి ఫాతిమా, బలసాని కిరణ్‌కుమార్, డిప్యూటీ మేయర్ వజ్రబాబు, వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు పానుగంటి చైతన్య, జిల్లా అధ్యక్షులు వినోద్ పాల్గొన్నారు.

తులసి రామచంద్రప్రభును సత్కరిస్తున్న కళాశాల సెక్రెటరీ, ప్రిన్సిపాల్, అధ్యాపకులు

దేశాభివృద్ధిలో గ్రామాల పాత్ర అమూల్యం

ప్రజాశక్తి-గుంటూరు

'సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, అంకుర పరిశ్రమలు- గ్రామీణ ఆర్థికాభివృద్ధిలో వీటి పాత్ర' అనే అంశంపై టిజెపిఎస్ కాలేజీలో జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తులసి సీడ్స్ ప్రైవేటు లిమిటెడ్ చైర్మన్ తులసి రామచంద్రప్రభ హాజరై మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధి దేశాభివృద్ధి అన్నారు. గ్రామాలలో వ్యవసాయంతో పాటుగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి ఉంటేనే గ్రామీణ ప్రజలు ఆర్థికంగా అభివృద్ధిచెందుతారన్నారు. పట్టణీకరణలో గ్రామాలను ప్రమాదంలో పడవేయవద్దని పేర్కొన్నారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ జనరల్ మేనేజర్ పి. శ్రీనివాసు మాట్లాడుతూ గ్రామాభివృద్ధి లో యువత కీలక పాత్ర పోషించాలని, సరికొత్త నూతన భావాలతో గ్రామాలలో పరిశ్రమలు స్థాపించి లాభదాయకమైన స్థితిని ఏర్పాటు చేయాలని చెప్పారు. జిల్లా పరిశ్రల శాఖ అధికారి ఎ.జయలక్ష్మి మాట్లాడుతూ కన్నతల్లిని మనం ఎంత ప్రేమిస్తామో మన గ్రామాలను కూడా అదేవిధంగా ప్రేమించాలన్నారు. కళాశాల సెక్రటరీ కె.వి.బ్రహ్మం మాట్లాడుతూ సరికొత్త ఆలోచనలతో, నాణ్యమైన అనుభవంతో విద్యార్థులు పరిశ్రమల స్థాపనలో రాణించాలన్నారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ డాక్టర్ యు.రవికుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యస్ అనితాదేవి, ఎంబిఎ విభాగాధిపతి డాక్టర్ బి.వి.హెచ్.కామేశ్వరశాస్త్రి పాల్గొన్నారు.

ఎఐ ద్వారా ఫార్మసీ రంగంలో విప్లవాత్మక మార్పులు

ప్రజాశక్తి-గుంటూరు

సావనీర్‌ను విడుదల చేస్తున్న అతిథులు

లాంలోని చలపతి ఫార్మసీ కాలేజీలో 'ట్రాన్స్ఫార్మింగ్ ఫార్మాస్యిటికల్ సైన్సెస్ అండ్ ఫార్మకో ఎకనామిక్స్ త్రు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్' అనే అంశంపై జరిగే అంతర్జాతీయ సదస్సు బుధవారం ప్రారంభం అయ్యింది. రెండ్రోజుల పాటు జరిగే ఈ సదస్సును ఇస్పార్ ఇండియా – అమరావతి చాప్టర్, ఫార్మకాలజీ, ఫార్మసీ ప్రాక్టీస్ విభాగం సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. సదస్సుకు చలపతి విద్యాసంస్థల అధినేత వైవి ఆంజనేయులు, సెక్రటరీ వై.సుజిత్‌కుమార్ అధ్యక్షత వహించారు. జెనీవా, యునైటెడ్ నేషన్ అడ్వైజర్ ఇంటర్నేషనల్ సీ.ఈ.వో. డాక్టర్ రంజిత్‌బార్శికర్ మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని, వీటి ద్వారా కంప్యూటర్లు మనిషి లాగే ఆలోచించ గలిగే, నిర్ణయాలు తీసుకోగలిగే సామర్థ్యాన్ని పొందుతున్నాయన్నారు. అంతే కాకుండా ఫార్మసీ, ఆరోగ్య సంరక్షణ రంగంలో విప్లవాత్మక మార్పులను తెచ్చాయని, ఇవి మందుల అభివృద్ధి, వ్యాధుల నిర్ధారణ, వ్యక్తిగత చికిత్స, ఆటోమేషన్ వంటి అనేక విధానాలలో ఉపయోగపడుతున్నాయి వివరించారు. గుంటూరు ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ ఎఐ సహాయంతో వైద్యరంగంలో, నిజజీవితంలో పెనుమార్పులు సంభవించాయన్నారు. ఉదాహరణకు వ్యాధులను అంచనా వేసి, సరైన చికిత్సను సూచించడం, కష్టమర్లకు అనుకూలమైన ఉత్పత్తులను సూచించడం, డేటా విశ్లేషణ ద్వారా వ్యాపార నిర్ణయాలను తీసుకోవడం, స్వయంచాలిత కార్లు, బ్యాంకింగ్‌లో మోసాలను గుర్తించడం వంటి మెరుగైన సేవలను త్వరితగతిలో అందిస్తున్నాయని వివరించారు. మలేషియా క్వెస్ట్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ డీన్, ప్రొఫెసర్ దాతుక్ డాక్టర్ అల్లెన్ మాథ్యూస్ మాట్లాడుతూ ఎఐ, మెషిన్ లెర్నింగ్ ఫార్మాకో ఎకనామిక్స్, ఫార్మాకో ఎపిడిమియాలజీ రంగాల్లో సమర్థవంతమైన డేటా విశ్లేషణ, ఖర్చు-ప్రభావిత ఔషధ విధానాలు, జనాభా ఆరోగ్య పరిశీలన కోసం విప్లవాత్మక మార్పులను తీసుకువస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో బెంగళూరు ఆక్సోక్రోమోఫోర్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మిస్టర్ శ్రేయస్‌బుర్జి, ఈజిప్ట్ కింగ్ సాల్మన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఫతుమన్సూర్, ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.వి.విలియ ఒక్కార్, క్లిన్ ఫార్మేట్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వి.మహేష్, కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాయండి : ఈస్ట్ డిఎస్‌పి

ప్రజాశక్తి-గుంటూరు

సమయపాలన, క్రమ శిక్షణ విద్యార్థుల విజయానికి సోపానాలని, పదో తరగతి విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాయాలని గుంటూరు ఈస్ట్ డిఎస్పి అబ్దుల్ అజీజ్ అన్నారు. సంగడిగుంటలోని జైన్ హైస్కూల్ ఫేర్‌వెల్ వేడుకలకు డిఎస్పి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్కూల్ డైరెక్టర్ డాక్టర్ మహమ్మద్ మున్ను అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిఎస్పి అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలోనూ అపారమైన శక్తి ఉందని, దానిని గుర్తించి ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులకు ఇప్పటి నుంచే స్పష్టమైన లక్ష్యాలు ఉండాలని, ఆ లక్ష్యం కోసం ఎంతటి కష్టమైనా ప్రయత్నించాలని చెప్పారు. జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకున్న వారిని మార్గదర్శంగా తీసుకోవాలని సూచించారు. రాబోయే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. డాక్టర్ మున్ను మాట్లాడుతూ గతేడాది తమ విద్యార్థులు 586 మార్కులు సాధించి, సిఎం చంద్రబాబునాయుడు చేత మన్ననలు పొందారని, ఈఏడాది కూడా మెరుగైన ఫలితాలు సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలోస్కూల్ ప్రిన్సిపాల్ పి.కనకదుర్గ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెటీరియల్ అందిస్తున్న డిఎస్పీ, స్కూల్ డైరెక్టర్

సిబార్, ఆర్‌విఆర్‌జెసి మధ్య అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి-గుంటూరు

వైద్యరంగంలో సాంకేతిక వినియోగం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో, రోగనిర్ధా రణ, వైద్య పరిష్కా రాల్లో నూతన ఆవిష్క రణలకు తోడ్పడేందుకు సిబార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్, ఆర్‌విఆర్ అండ్ జెసిసిఈ ఎస్‌టిపి ఫౌండేషన్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని పేర్కొన్నారు. బుధవారం ఆర్‌విఆర్ అండ్ జెసి కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. బయోటెక్నాలజీ, బయోమెడికల్ ఇంజనీరింగ్, డెంటల్ రంగాల్లో పరిశోధన, ఇన్నోవేషన్ల అభివృద్ధికి ఈఒప్పందం దోహద పడుతుందని కళాశాల సెక్రెటరీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబార్ డీన్ డాక్టర్ ఎల్.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వెంకట రమణారెడ్డి, ఆర్‌విఆర్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న ఇరు సంస్థల ప్రతినిధులు